

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 31.0
కనిష్ఠం : 21.0



కమనీయం.. కావిడి ఉత్సవం

ద్వారకాతిరుమల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్యం మాం పాహి...స్వామినాథ మాం పాహి... అంటూ భక్తులు కావిడిలను ధరించి శ్రీవారి క్షేత్రంలో గురువారం తిరుగాడారు. ద్వారకా తిరుమల వేంకటేశ్వర స్వామి క్షేత్ర దత్తత దేవాలయమైన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దివ్య కల్యాణోత్సవాలు నేత్రపర్వంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా జరిగిన కావిడి ఉత్సవం భక్తులకు నేత్రపర్వమైంది. సంప్రదాయబద్ధంగా పంచె, కండువా ధరించి ఈ సేవలో పాల్గొన్న భక్తులకు ఆలయంలో అర్చకులు వేద మంత్రోచ్ఛరణలతో కావిడిలను అందించారు. అనంతరం వారు సుబ్రహ్మణ్యుడి చిత్రపటంతో క్షేత్రంలో తిరుగగా వారి పాదాలను భక్తులు కడిగి భక్తిభావాలను చాటారు. బాలలు సైతం ఇందులో పాల్గొనడం విశేషం. కాగా వల్లీ దేవసేన సమేతంగా సుబ్రహ్మణ్యేశ్వరుడు నెమలి వాహనంపై కొలువుతీరి గురువారం రాత్రి క్షేత్ర పురవీధుల్లో ఊరేగారు. అట్టహాసంగా జరిగిన ఈ ఉత్సవం భక్తులకు నేత్రపర్వమైంది. ముందుగా ఆలయ ప్రాంగణంలో విశేషపుష్పాలంకారాలతో నెమలివాహనాన్ని అలంకరించి దానిపై స్వామి, అమ్మవార్లను ఉంచి హారతులిచ్చారు. మంగళ వాయిద్యాలు, అర్చకుల వేదమంత్రోచ్ఛరణల నడుమ ఊరేగింపు జరిగింది. మరోవైపు జిల్లా వ్యాప్తంగా షష్ఠి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. సింగరాయపాలెంలో నాగ ప్రతిమలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



సింగరాయపాలెంలో నాగ ప్రతిమలకు పూజలు చేస్తున్న మహిళలు



ద్వారకా తిరుమలలో నెమలి వాహనంపై కొలువైన సుబ్రహ్మణ్యునికి, అమ్మవార్లకు హారతులు

స్కూల్ బస్సుల భద్రతా లోపాలపై ప్రత్యేక తనిఖీలు

ఏలూరు క్రైం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్, ట్రాన్స్‌పోర్టు కమిషనర్ ఆదేశాల మేరకు విద్యా సంస్థల బస్సుల్లోని భద్రతా లోపాలపై ప్రత్యేక స్నేహపూర్వక తనిఖీలు వారం రోజుల పాటు కొన సాగుతాయని ఇన్‌చార్జి ఉపరవాణా కమిషనర్ కేఎస్ ఎంవీ కృష్ణారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తనిఖీల్లో రవాణాశాఖ అధికారులు విద్యాసంస్థల బస్సుల్లోని భద్రతా లోపాలను గుర్తించి నోటీసులు అందిస్తారన్నారు. వాహన ఫిట్‌నెస్, ట్యాక్స్, పర్మిట్, ఇన్సూరెన్సు, డ్రైవింగ్ లైసెన్సు విషయాలలో ప్రత్యేక దృష్టి సారించి కేసులు నమోదు చేస్తామన్నారు.

దరఖాస్తు గడువు పెంపు

ఏలూరు,నవంబరు 27(ఆంధ్రజ్యోతి): వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలు, ఉచిత శిక్షణకు దరఖాస్తు గడువును డిసెంబరు 3వ తేదీ వరకు పొడిగించినట్టు బీసీ సంక్షేమాధికారి ఆర్‌వీ నాగరాణి ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు 'బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయం, వెన్నవల్లివారి పేట, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్కూల్, ఫస్ట్‌ఫ్లోర్ ఏలూరు'కు డిసెంబరు 3వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హులైన వారికి డిసెంబరు 7న రాజమహేంద్రవరంలో స్క్రీనిం గ్ పరీక్ష జరుగుతుందన్నారు. వివరాలకు 86861 80018, 9030 211920 నెంబర్లలో సంప్రదించాలని నాగరాణి కోరారు.



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న ఎంపీ పుట్టా మహేశ్ కుమార్

నాణ్యమైన మౌలిక వసతులు కల్పించాలి : ఎంపీ

పెదపాడు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటుగా నాణ్యమైన మౌలిక వసతులు కల్పించాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ సూచించారు. వట్లూరులోని బాలికల గురుకుల పాఠశాలను గురువారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులు, క్యాంటీన్, భోజనశాలను పరిశీలించారు. విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. బోధన అంశాలపై అధ్యాపకులతో చర్చించారు. అనంతరం విద్యార్థులతో కలిసి పాఠశాల లోనే భోజనం చేశారు. పాఠశాలలో ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానన్నారు. పాఠశాల, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచిన అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఝాన్సీరాణి పాల్గొన్నారు.

టీడీపీ జిల్లా అధ్యక్ష పదవిపై

వీడని ఉత్కంఠ

- బడేటి , గన్ని పేర్లను సూచిస్తూ ఫోన్‌కాల్స్.. అభిప్రాయ సేకరణ
- ఆశావహులకు తప్పని నిరాశ

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

టీడీపీ జిల్లా అధ్యక్ష పదవిని ఎవరికి కట్టబెట్టాలన్న దానిపై అధిష్ఠానం మల్లగుల్లాలు పడుతోంది. జూలైలో ఆశావహుల నుంచి దరఖాస్తుల స్వీకరణ చేపట్టింది. ప్రస్తుత అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, ఇతర నేతలు పెనుమర్తి రామ్‌కుమార్, దాసరి శ్యామ్‌చంద్ర శేషుల పేర్లు తుది జాబితాకు చేర్చారు. ఇది జరిగి మూడు నెలలు అయినా ఎవర్ని అందలం ఎక్కించాలన్న విషయంపై స్పష్టత కరువైంది. దీపావళి ముందుగా ఐవీఆర్‌ఎస్ సర్వేలను రెండుమార్లు అధిష్ఠానం చేపట్టింది. అప్పటి వరకు దరఖాస్తు చేసుకోని కైకలూరు నియోజకవర్గ నేత వీరమల్లు నరసింహారావు, ప్రస్తుత అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు పేర్లతో ఐవీఆర్‌ఎస్ సర్వే చేపట్టారు. అనంతరం ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి), గన్ని పేర్లతో రెండోమారు ఐవీఆర్‌ఎస్ సర్వే చేపట్టారు. మళ్లీ నెలరోజులు గడిచాక తాజాగా బడేటి చంటి, గన్ని వీరాంజనేయుల్లో ఎవరికి అధ్యక్ష పదవిని - మిగతా 6వ పేజీలో

మూడు రోజులే గడువు!

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా గ్రామీణ ప్రాం తాల్లో ఇళ్ల నిర్మాణానికి, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (గ్రామీణ్)- ఎన్టీఆర్ పథకాన్ని అమలు చేస్తున్నాయి. అర్హులను గుర్తించేందుకు ప్రత్యేక యాప్ తీసుకొచ్చి ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తున్నారు. జిల్లాలో వెల్లువలా దరఖాస్తులు వచ్చి పడుతున్నాయి.

సొంతిల్లు-ఇంటి స్థలం కోసం దరఖాస్తుల వెల్లువ

- పీఎంఏవై గ్రామీణ్‌లో కొత్తగా ఇళ్ల కోసం దరఖాస్తులు
- 30 వరకు గడువు.. ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులు 22,388
- ఆవాస్ ప్లస్ యాప్ ద్వారా లబ్ధిదారుల ఎంపిక



ఏలూరుసిటీ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కొత్తగా ఇళ్లకు, ఇళ్ల స్థలాలకు గ్రామీణ ప్రాంతాల్లో అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 30వ తేదీ వరకు గడువు ఇచ్చారు. ఇప్పటికే జిల్లాలో 22,388 దర ఖాస్తులు వచ్చాయి. సొంత స్థలం ఉండి అక్కడే నిర్మాణం చేపడతామనే వారికి ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం చేస్తారు. అసలు స్థలం లేకపోతే గ్రామీణ ప్రాంతాల్లో మూ డు సెంట్లు స్థలాన్ని కేటాయించి ఇంటి నిర్మాణాన్ని చేపడ తారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎన్టీఆర్ ఇళ్ల నిర్మాణాలను అసంపూర్తిగా పూర్తి చేసిన వారికి మిగిలిన భాగం పూర్తి చేయడానికి దరఖాస్తులు కోరుతున్నారు. గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి.

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారుల ఎంపిక పకడ్బందీగా జరిగేలా కేంద్ర ప్రభుత్వం ఆవాస్‌ప్లస్ అనే ప్రత్యేక యాప్‌ను తీసుకొచ్చింది. రాష్ట్రంలో అర్హులను గుర్తించే బాధ్యతను గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్, గృహనిర్మాణ శాఖ ఏఈలకు ప్రభుత్వం అప్పగించింది. వీరు ఇంటింటికీ వెళ్లి అర్హులను గుర్తించాలి. దరఖాస్తుదారు ప్రస్తుతం నివాసం ఉంటున్న ఇల్లు, లొకేషన్ ఫొటోలు యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు, కొత్తగా ఎక్కడ ఇంటి నిర్మాణం చేపడతారో ఆ స్థలాన్ని ఫొటో - మిగతా 6వ పేజీలో

నెలాఖరు వరకు గడువు

ఇంటి స్థలం ఉండి ఇల్లులేని వారు, అసలు ఇంటి స్థలం లేనివారు, గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసిన వారిలో అర్హులు ఈనెల 30వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలి. ఇప్పటికే జిల్లాలో 22, 388 దరఖాస్తులు వచ్చాయి. అర్హులైన వారిని ఎంపిక చేసి ఇల్లు, ఇంటి స్థలాన్ని మంజూరు చేస్తారు. ఇంకా మూడు రోజులు మాత్రమే గడువు ఉండటంతో అర్హులు దరఖాస్తు చేసుకోవాలి.

- జి.సత్యనారాయణ, జిల్లా హౌసింగ్ పీడీ

సీఎం చంద్రబాబు పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష



ఏలూరు,నవంబరు 27(ఆంధ్రజ్యోతి): డిసెంబరు ఒకటిన ఉంగుటూరు మండలంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటించనున్న నేపథ్యంలో ఏర్పాట్లపై కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులతో గురువారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. మండలంలో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు సీఎం సామాజిక పెన్షన్ల పంపిణీ, బంగారు కుటుంబాలు, మార్గదర్శకులతో సమావేశమయ్యే అవకాశం ఉందన్నారు. అనం తరం బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారన్నారు. గొల్లగూడెం, గోపీనాథపట్నంల్లో సీఎం పాల్గొనే కార్యక్రమాల వద్ద పటిష్ట ఏర్పాట్లు చేయాల న్నారు. హెలీప్యాడ్, సభాస్థలి ప్రాంతాలను అధికారులు పరిశీలించి ప్రతిపాదనలను సమర్పించాలన్నారు. జేసీ ఎంజే అభిషేక్ గౌడ, జడ్పీ సీఈవో శ్రీహరి, ఏలూరు ఆర్డీవో అచ్యుత అంబరీష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కూటమి నేతల సన్నాహక సమావేశం

నిడమర్రు నవంబరు 27(ఆంధ్రజ్యోతి):డిసెంబరు ఒకటిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటించనున్న నేపథ్యంలో ఏర్పాట్ల నిమిత్తం ఉంగుటూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం కూటమి నేతలు సన్నాహక సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, బీజేపీ కన్వీనర్ శరణాల మాలతీరాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి కూటమి పార్టీ ముఖ్య నేతలు హాజరయ్యారు. జనసమీకరణ, రూట్ మ్యాప్, సభ వద్ద ప్రజలకు సౌకర్యాలు తదితర అంశాలపై చర్చించారు. ఎమ్మెల్యే ధర్మరాజు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయడానికి గ్రామ, మండలస్థాయిల వారీగా సమావేశాలు నిర్వహించాలన్నారు. ఆప్కాబ్ చైర్మన్ గన్ని మాట్లాడుతూ సీఎం పర్యటనలో భాగంగా హెలీప్యాడ్ , రైతన్న మీకోసం, గొల్లగూడెంలో ఎంపిక చేసి లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీపై రేపటి లోగా స్పష్టత వస్తుందన్నారు. బీజేపీ కన్వీనర్ శరణాల మాలతీరాణి మాట్లాడుతూ సీఎం పర్యటన ఉంగుటూరు నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందడానికి దోహదపడుతుందన్నారు. కూటమి నేతలు ముత్యాలస్వామి, తోట శ్రీను, నిమ్మల దొరబాబు, పి.రాంబాబు,జ్యోతి అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు. కాగా సీఎం సభాస్థలి ప్రాంగణాన్ని ఎమ్మెల్యే ధర్మరాజు, గన్ని, ఆర్డీవో, డీఎస్పీ పరిశీలించారు.



సీఎం చంద్రబాబు సభాస్థలి ప్రాంగణంను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు, గన్ని, ఆర్డీవో తదితరులు



ముసునూరులో యంత్రంతో కోస్తున్న వరిపంట

రైతుల గుండెల్లో.. తుఫాన్!

- ముంచుకొస్తున్న దిత్వా తుఫాన్
- ముమ్మరంగా వరికోతలు
- 84,335 ఎకరాల్లో కోతలు పూర్తి
- కల్లాల్లోనే 70,253 మెట్రిక్ టన్నుల ధాన్యం
- ధాన్యం సేకరణ వేగవంతం : కలెక్టర్
- ముందస్తుగా అప్రమత్తం : జేసీ

ఏలూరుసిటీ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తుఫాన్‌లు వీడడం లేదు. ఇటీవల మొంథా.. నిన్న సెన్‌యార్.. నేడు దిత్వా తుఫాన్ ముంచుకొస్తోంది. సెన్‌యార్ ప్రభావం చూపకపోయినా దిత్వా తుఫాన్ తీవ్రత ఎక్కువగానే ఉంటుందని ఐఎండీ తెలిపింది. ఈనెల 29, 30 తేదీల్లో భారీగా వర్షాలు కురిసే అవకాశం ఉందని ఇప్పటికే వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. శ్రీలంకను అనుకుని ఉన్న నైరుతి బంగాళాఖాతంలో తుఫాన్ ఏర్పడగా దిత్వా అని నామకరణం చేశారు. తీరం వెంబడి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని చెబుతున్నారు. శనివారం నుంచి సోమవారం వరకు భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తున్నారు. దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాలకు ఈ తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్నా ఇక్కడ కూడా వాతావరణ పరిస్థితుల కారణంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని చెబుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్న సమయంలో తుఫాన్ ప్రభావం చూపిస్తే పంట నష్టం తీవ్రంగా ఉంటుందని రైతుల్లో గుబులు మొదలైంది.

84,335 ఎకరాల్లో వరి కోతలు పూర్తి

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ వరి సాగులో 2,07, 203 ఎకరాల్లో వరి సాగు చేయగా ఇప్పటివరకు 84,335 ఎకరాల్లో వరికోతలు పూర్తవ్వగా 1,23,184 ఎకరాల్లో కోతలు పూర్తి కావాల్సి ఉంది. ఇప్పటి వరకు జిల్లాలో లక్షా 29,338 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు పూర్తయింది. ఇంకా 70,253 మెట్రిక్ టన్నులు ధాన్యం కల్లాల్లోనే ఉంది. 19వేల 52 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు సిద్ధంగా ఉంది.

అవగాహన కల్పిస్తున్నాం: జేసీ

వాతావరణ శాఖ తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో రైతులు ఎటువంటి పంట నష్టం జరుగకుండా రైతులకు ముందస్తు జాగ్రత్త చర్యలపై అవగాహన కలిగిస్తున్నామని జేసీ ఎంజే అభిషేక్ గౌడ రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కె.విజయానంద్‌కు తెలిపారు. జిల్లా కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గురువారం ధాన్యం కొనుగోలుతో పాటు వివిధ అంశాలపై సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.జేసీ మాట్లాడుతూ వాతావరణ శాఖ తుఫాన్ హెచ్చరిక జారీ చేసిన దృష్ట్యా రైతుల పంటకు నష్టం కలుగకుండా రైతు సేవా కేంద్రాల వద్ద టార్పాలిన్లు సిద్ధం చేస్తామన్నారు. ధాన్యం సేకరణను మరింత వేగవంతం చేస్తున్నామన్నారు. జడ్పీ సీఈవో శ్రీహరి, ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ భానుప్రతాప్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ముదినేపల్లి - గుడివాడ జాతీయ రహదారి వెంబడి ఆరబెట్టిన ధాన్యం

ధాన్యం సేకరణ మరింత వేగవంతం చేయాలి : కలెక్టర్

జిల్లాలో ఈనెల 30వ తేదీ నుంచి మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ హెచ్చరికల దృష్ట్యా ధాన్యం సేకరణను మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. వాతావరణ శాఖ తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో పంట నష్టం నివారణ చర్యలపై అధికారులతో ఆమె టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. వర్షాల కారణంగా పంట నష్టం జరగకుండా అధికారులు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకుని అమలు చేయాలన్నారు. ప్రస్తుతం కల్లాలపై ఉన్న ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు అవసరమైన టార్పాలిన్‌లను రైతు సేవా కేంద్రాల వద్ద సిద్ధంగా ఉంచాలన్నారు. వర్షాల సమయంలో ధాన్యం బస్తాలను ప్రభుత్వ కార్యాలయాల ఖాళీ భవనాల్లో భద్రపరచుకోచ్చునన్నారు జేసీ అభిషేక్ గౌడ , జిల్లా వ్యవసాయ శాఖాధికారి షేక్ హబీబ్‌బాషా, వ్యవసాయ శాఖాధికారులు, మండల, గ్రామ వ్యవసాయ శాఖ సిబ్బంది , రైతు సేవాకేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

■ లోపలి పేజీలో..

శ్రీవారి అంతరాలయ దర్శనం పునఃప్రారంభం

'నూజివీడు'ను ఎన్టీఆర్ జిల్లాలో కలపాలి
- జేఏసీ ఆధ్వర్యంలో నిరసన దీక్షలు

గొడౌన్‌లో గృహ నిర్మాణ సామగ్రి
- మూడేళ్లుగా దోచేస్తున్న గృహ నిర్మాణ సిబ్బంది
- ఎమ్మెల్యే తనిఖీలో బయటపడ్డ రూ.8 కోట్ల సామగ్రి వ్యవహారం

ప్రజలు అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలి

- ఎమ్మెల్యే బడేటి చంటి
- తంగెళ్లమూడి జాతరకు ముడుపులు



అమ్మవార్ల కోసం కలశాలతో నీటిని తీసుకెళ్తున్న భక్తులు



ఏలూరుకార్పొరేషన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఏలూరు నగరంలో ప్రజలంతా అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలనే ఆకాంక్షతో ఏ ప్రాంతంలో జాతరలకు ముందుకు వచ్చినా ఆ కమిటీలను పూర్తిగా ప్రోత్సహిస్తున్నామని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి స్పష్టం చేశారు. తంగెళ్లమూడిలో గంగానమ్మ, మహా లక్ష్మమ్మ, వినుకొండ వెంకమ్మ, పోతురాజుబాబుల జాతర మహో త్సవానికి గురువారం ముడుపులు కట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. తంగెళ్లమూడి యాదవనగర్ రామాలయం నుంచి అమ్మవారికి బిందెలతో పసుపు నీళ్ల తీసుకెళ్లి శివ గోపాలపురం కాలనీలోని గంగానమ్మ అమ్మవార్లకు స్నానాలు ఆచరించి ఘట ఆవాహన చేశారు. అమ్మవారిని పొలిమేర్ల నుంచి ఆహ్వానించి రామాలయం వద్దకు తీసుకువచ్చి జాతర ముడుపు కట్టారు. పందిరి రాటాను వేశారు. ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ నగర ప్రజలంతా ఐకమత్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఎంపీ పుట్టా మహేష్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ మామిళ్ళపల్లి పార్థసారథి, ఈడా చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



ముడుపును దర్శించుకుంటున్న ఎమ్మెల్యే చంటి దంపతులు, ఎంపీ మహేశ్ కుమార్

పాల్ ల్యాబ్ విద్యార్థులకు వరం


పాల్ ల్యాబ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

పెనుమంట్ర, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని మార్టేరు శ్రీ వేణుగోపాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పర్సనలైజ్డ్ లెర్నింగ్ (పాల్ ల్యాబ్) ల్యాబ్‌ను రాష్ట్ర పరిశీలకులు బి. కిషోర్‌బాబు జిల్లా, సమగ్ర శిక్ష ఏఎంవో చంద్రశేఖర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎలక్ట్రిఫికేషన్ పనులను, మెటీరియల్ నాణ్యతను క్షుణ్ణంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. పాల్‌ల్యాబ్ విద్యార్థులు పాలిట ఒక వరమన్నారు. సక్రమంగా ఉపయోగించుకోవడం ద్వారా విద్యార్థులు తరగతికి తగిన సామర్థ్యాలు అందుకోగలరన్నారు. దాని కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. సమగ్ర శిక్ష ఏఎంవో చంద్రశేఖర్‌మాట్లాడుతూ పాల్ ల్యాబ్ ద్వారా పాఠశాలకు 30 ట్యాబ్‌లు, హెడ్ ఫోన్స్ తదితర మెటీరియల్ అందిస్తామని తెలిపారు. టైం టేబుల్‌లో వారానికి రెండు పీరియడ్‌లు కేటాయించి విద్యార్థులు సమగ్రాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఉంగరాల నాగేశ్వరరుఆవు, ఉపాధ్యాయులు వెంటక నరేంద్ర, రవీంద్ర, ప్రసాద్‌రెడ్డి, సతీష్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.


పాలకొల్లులో మాట్లాడుతున్న జస్బీర్ సింగ్ గిల్ (దింపా)

కాంగ్రెస్ బలోపేతానికి పాటుపడాలి

పాలకొల్లు అర్బన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసి పూర్వవైభవం తీసుకురావడానికి ప్రతి కార్యకర్త, నాయకుడు పాటు పడాలని ఏఐసీసీ మెంబర్, నరసాపురం పార్లమెంట్ పరిశీలకుడు జస్బీర్ సింగ్ గిల్ (దింపా) అన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశంలో దింపా ముఖ్య వక్తగా విచ్చేసి మాట్లాడారు. ప్రతి కార్యకర్త ప్రజలతో మమైకమ్మై పనిచేయాలన్నారు. ఈకార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గొగులమండ భాస్కరరావు, కో ఆర్డినేటర్ కొరగింజల హరికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆచంట:కాంగ్రెస్ పార్టీ ఎపుడూ కూడా ప్రజలకు దగ్గరగా ఉండి వారి అభివృద్ధికి పాటు పాడుతుందని దింపా అన్నారు. గురువారం ఆచంటలో పార్టీ సంస్థాగత నిర్మాణ కార్యక్రమంలో భాగంగా జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా దింపా పాల్గొన్నారు. సమావేశంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు పాతపాటి హరి కుమార్ రాజు, ఆచంట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి నెక్కంటి సతీష్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అశోక్ ధావల్

'కేంద్రానిది కార్పొరేట్ ప్రభుత్వం'

భీమవరం టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ ది కార్పొరేట్ ప్రభుత్వమని, కార్పొరేట్లకు రాయితీలిస్తున్నారు కానీ రైతుల ఆత్మహత్యలు నివారించలేకపోతున్నారని, నాడు వ్యవసాయ చట్టాలు, నేడు లేబర్ చట్టాలు మార్పు కార్పొరేట్లకోసమే అని అఖిల భారత కిసాన్ సభ అధ్యక్షుడు అశోక్ ధావలే ఘాటుగా విమర్శించారు. గేరువారం స్థానిక ఏఎస్ఆర్‌నగర్‌లో ఉన్న అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రంలో ఉద్ధరాజు రామం మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతాంగ సమస్యలు, ప్రభుత్వాల బాధ్యత అనే అంశంపై సెమినార్‌కు మంతెన సీతారామ్ అధ్యక్షత వహించగా ఆయన ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఇక్కడ బాబు, అక్కడ మోదీ ఇద్దరూ 2047 విజన్ పేరుతో దేశంలో, రాష్ట్రంలో ఉన్న కార్పొరేట్లకు భూములు పంపిణీ చెయ్యాలని చూస్తున్నారన్నారు. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య, ఉద్ధరాజు రామం మెమోరియల్ ఫౌండేషన్ కార్యదర్శి, రైతుసంఘం రాష్ట్ర నేత బి.బలరాం మాట్లాడారు.

రైతు భవనానికి నిధి అందజేత

ఢిల్లీలో నిర్మిస్తున్న రైతు భవనానికి రైతు కార్యాచరణ సమితి నేతలు పాతపాటి మురళీ రామరాజు, కలిదిండి గోపాలకృష్ణ రాజు, పేరిచర్ల లక్ష్మణ వర్మ, ఆర్.రఘురామరాజు నిధి అందించారు. ఉద్ధరాజు రామం మెమోరియల్ ఫౌండేషన్ తరఫున 50 వేల రూపాయలు చెక్కును ఫౌండేషన్ చైర్మన్, కార్యదర్శి, సభ్యులు చేతులమీదుగా అశోక్ ధావలే అందించారు.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలు ప్రారంభం

పాలకోడేరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ యువత క్రీడల్లో సత్తా చాటేందుకు స్కూల్ గేమ్స్ పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయని ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి అన్నారు. శృంగవృక్షం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి నెట్ బాల్ అండర్-14 బాలురు బాలికల పోటీలను గురువారం డీఈవో నారాయణతో కలిసి ఆయన ప్రారంభించారు. 13 జిల్లాల నుంచి సుమారు 390 మంది క్రీడాకారులు తరలి వచ్చారు.

పార్లమెంట్



పెదతాడేపల్లి జడ్పీ పాఠశాలలో మాక్ పార్లమెంట్

అసెంబ్లీ


భీమవరం ఝాన్సీ లక్ష్మీబాయి మునిసిపల్ హైస్కూల్‌లో మాక్ అసెంబ్లీ

ఆకట్టుకున్న విద్యార్థుల మాక్ పార్లమెంట్, అసెంబ్లీ

తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి):పెదతాడేపల్లి జడ్పీఉన్నత పాఠశాల విద్యార్థులు నిర్వహించిన మాక్ పార్లమెంట్ సమావేశం ఆకట్టుకున్నది. ప్రతిపక్ష నాయకుల ప్రశ్నలు, అధికార పార్టీ నేతల సమాధానాలు అంశాల వారీగా విద్యార్థులు పార్లమెంటు పద్ధతులు, పనితీరు ప్రజలకు కళ్ళకు కట్టినట్టు చూపించారు. ఈ మాక్ పార్లమెంట్ ద్వారా విద్యార్థులకు ప్రభుత్వ విధానాలు, శాఖల సమన్వయం తదితర అంశాలు తెలుస్తాయని హెచ్ఎం షేక్ లాల్‌బీబీ పేర్కొన్నారు.

భీమవరం రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా భీమవరం టూటౌన్‌లోని ఝాన్సీ లక్ష్మీబాయి మునిసిపల్ హైస్కూల్‌లో విద్యార్థినులు మాక్ అసెంబ్లీ నిర్వహించారు. పిల్లలందరూ ఉత్సాహంగా పాల్గొని ప్రశ్నలతో ఆకట్టుకున్నారు. స్కూల్ హెచ్ఎం కె.కృష్ణకుమారి మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు పిల్లల్లో సృజనాత్మకత పెరగడానికి ఎంతో దోహదపడతాయని తెలిపారు. ఉపాధ్యాయురాలు కాంచన రచించి, దర్శకత్వం వహించారు.

ఆడుతూ.. పాడుతూ

అంతర్ కళాశాలల వెటర్నరీ పాలిటెక్నిక్ పోటీలు

తుది దశకు చేరిన క్రీడలు

వెంకట్రామన్నగూడెం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ ప్రాంగణంలో మూడు రోజులుగా జరుగుతున్న వెటర్నరీ పాలిటెక్నిక్ ఇంటర్ కళాశాలల క్రీడా, అథ్లెటిక్స్, సాంస్కృతిక పోటీలు తుది దశకు చేరుకున్నాయి. మూడు రోజులుగా వివిధ క్రీడల్లో విద్యార్థులు తమ ప్రతిభ కనబరుస్తున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ ఈ పోటీలు తమకు ఎంతో ప్రత్యేకమని అభిప్రాయ పడుతున్నారు. రాష్ట్రంలో పది పాలిటెక్నిక్ కళాశాలల నుంచి వచ్చిన క్రీడాకారులు సరదాగా పోటీ పడుతూ ఈ పోటీ తమకు ఎంతో ప్రత్యేకం అంటున్నారు.

- తాడేపల్లిగూడెం రూరల్

క్రీడలంటే ఇష్టం



క్రీడలంటే నాకు ఎంతో ఇష్టం. అందుకే అంతర్ కళాశాలల పోటీలకు వచ్చాం. గతేడాది జరిగిన పోటీల్లో వాలీబాల్‌లో సెమిస్ వరకూ వెళ్లాం. ఈ సారి ఖోఖో పోటీల్లో మా గరివిడి జట్టు ఫైనల్‌లో విజేతగా నిలిచింది. ఎంతో ఆనందంగా ఉంది.

టి.పవన్, గరివిడి

పోటీల్లో పాల్గొనడం ఆనందంగా ఉంది



మేం ఎంతో ఆనందంగా ఈ పోటీలకు హాజరయ్యాం. మిగిలిన కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థులతో తమ కళాశాల విద్యార్థులు అంతా కలిసి పోటి పడటం మాలో నూతనొత్తేజం కలిగింది. ప్రస్తుతం పోటీల్లో వాలీబాల్‌లో విజేతలుగా నిలవడం ఎంతో ఆనందంగా ఉంది.

- జి.కృష్ణతేజస్వినీ, గరివిడి


టెన్నికాయిట్ ఆడుతున్న క్రీడాకారులు

ఎక్కువ పతకాలు సాధిస్తాం



మా జట్టు వాలీబాల్‌లో సెమిస్‌కు చేరుకుంది. ఈ పోటీల్లో మా పాలిటెక్నిక్ కళాశాల నుంచి ఎక్కువ పతకాలు సాధిస్తాం. ఇక్కడివాతావరణం, సౌకర్యాలు బాగున్నాయి.

- పి.వరుణ్, సదుం పాలిటెక్నిక్

విజేతగా నిలవాలని వచ్చాం



మేం అన్ని క్రీడల్లో శిక్షణ పొందాం. ఈ సారి అన్ని పోటీల్లో విజేతలుగా నిలవాలని సంకల్పంతో ఆడుతున్నాం. ప్రస్తుతం ఖోఖోలో విజేతలుగా నిలవడం ఎంతో ఆనందంగా ఉంది.

బి.అసిన్, బన్నాసి

పోటీల్లో సత్తాచాటుతాం



క్రీడా పోటీలు మా కళాశాల ప్రాంగణంలో నిర్వహించడం ఆనందంగా ఉంది. ఈ పోటీల్లో మా జట్టు టేబుల్ టెన్నిస్‌లో విజేతగా నిలిచాం. ఇంకా మిగిలిన పోటీలు గెలిచి ఈ పోటీలు ప్రత్యేకంగా చూసుకుంటున్నాం.

కె.భానుశ్రీ, వీఆర్‌గూడెం


నడకను ప్రారంభించిన కలెక్టర్ నాగరాణి

డీఎన్ఆర్‌లో పారా క్రీడలు ప్రారంభం

భీమవరం టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): డీఎన్ఆర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పారా క్రీడలను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి గురువారం ప్రారంభించారు. తొలుత పారా క్రీడల కోసం అవగాహన నడకను జి ల్లా కలెక్టర్ పచ్చ జెండా ఊపి ప్రారంభించి, బధిర విద్యార్థులతో కలిసి నడిచారు. దివ్యాంగులను ఉత్సాహపరిచే విధంగా వారితో కలిసి స్వయంగా జిల్లా కలెక్టర్ క్రికెట్ ఆడి బ్యాటింగ్, బౌలింగ్ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగులు ఏరంగంలోను తీసిపోని విధంగా అన్ని రంగాల్లో పోటీ పడాలన్నారు. మీ సామర్థ్యం, మీ బలం మీకు తెలియదని వైకల్యం లేని వారి కంటే మీరు ఎంతో సమర్థులని పేర్కొన్నారు. మీ అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాయని, ఎన్నో అభివృద్ధి పథకాలతో పాటు ప్రోత్సాహాలను కూడా అందిస్తున్నాయన్నారు. బ్యాడ్మింటన్ సింగిల్స్ డబుల్స్, క్రికెట్, 100 మీటర్ల పరుగు పందెం, షాట్ పుట్ నాలుగు విభాగాల్లో పారా అథ్లెట్ల కోసం బాల, బాలికలకు క్రీడలను నిర్వహించడం జరుగుతుందన్నారు. వివిధ బధిర పాఠశాలల నుంచి సుమారు 80 మంది బాల, బాలికలు పారా క్రీడల్లోపాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి శాఖ అధికారి ఎం.మోహన్ దాస్, డీఎన్ఆర్ కళాశాల సెక్రటరీ గాదిరాజు సత్యనారాయణ(బాబు), ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు, రామకృష్ణంరాజు, పీడీ బి.వి నరసింహారాజు, ఫిట్ జోన్ జిమ్ నిర్వాహకులు దాసరి చందు, భీమవరం వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కందుల సురేష్, తదితరులు పాల్గొన్నారు.



గోసంరక్షణశాల వద్ద ఫెన్సింగ్ ఏర్పాటు

ద్వారకాతిరుమల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రాణ నష్టం జరిగిన తర్వాతే అధికారులు మేల్గొన్నారు. సెప్టిక్ ట్యాంక్‌లో పడి గిరి జాతి ఆవు మృతి చెందిన తర్వాత కళ్లు తెరచిన అధికారులు వాకింగ్ ట్రాక్‌కు సెప్టిక్ ట్యాంక్‌కు మధ్య రక్షణ చర్యలు చేపట్టారు. ఈక్రమంలో ఫెన్సింగ్‌ను నిర్మించారు. శ్రీవారి గోసంరక్షణశాలలోని ఇటీవల మూడు గోవులు అకాల మరణం పొందిన విషయం తెలిసిందే. అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా రెండు గోవులు విద్యుదాఘాతంతో మృతి చెందితే తాజాగా మరో గోవు సెప్టిక్ ట్యాంకులో పడి మృత్యుఒడికి చేరుకున్న విషయం తెలిసిందే. ఆవులు సంచరించే ప్రాంతంలో సరైన రక్షణలేక పోవడంతో పాటు శిథిలావస్థకు చేరిన ఈ ట్యాంక్ కారణంగా గిరి జాతికి చెందిన ఓ గోవు మృత్యువాత పడటం భక్తులను ఆవేదనకు గురిచేసింది. ఈ ఘటనలు జరిగిన తర్వాత మేల్కొన్న ఆలయ అధికారులు గురువారం వాకింగ్ ట్రాక్‌కు సెప్టిక్ ట్యాంక్‌కు మధ్యగా ఫెన్సింగ్‌ను వేసి రక్షణ చర్యలు తీసుకున్నారు.

టీ20 ఆంధ్ర క్రికెట్ టీమ్‌కు మునీష్‌వర్మ



ఏలూరు రూరల్, నవంబరు 27, (ఆంధ్రజ్యోతి): బీసీసీఐ సయ్యద్ మస్తాక్ ఆలీ టీ20 ట్రోఫీ ఆంధ్ర టీమ్‌కి ఏలూరు కుర్రాడు మునీష్‌వర్మ ఎంపిక అయ్యాడు. ఏలూరుకి చెందిన బి.మునీష్ వర్మ గతంలో సెంట్రల్ జోన్ టోర్నమెంట్, ఆంధ్ర ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల్లో అద్భుతమైన ప్రతిభ కనబరిచారు. ఈక్రమంలో బీసీసీఐ నిర్వహించే టీ 20 టోర్నమెంట్ ఆంధ్ర టీమ్ జట్టు సభ్యుడుగా మునీష్‌వర్మ ఎంపిక అయ్యాడు. వర్మ ఐపీఎల్‌కి కూడా ఎంపిక అవ్వాలని స్థానిక క్రికెటర్ల కోరుకుంటున్నారు.

గేటు పడినా.. ఆగేదేలే!

రైల్వే గేట్ల వద్ద ఆతృత.. ప్రాణాలకే ముప్పు

ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల పరిధిలోని రైల్వే గేట్ల వద్ద రెండేళ్లల్లో దాదాపు 82 మంది మృతి


ఉండి రోడ్డులో రైలు గేటు పడుతుండగానే కింద నుంచి వెళ్లి పోతున్న వాహనదారులు


భీమడోలులో రైలు గేటు కింద నుంచి వస్తున్న మహిళలు


పవర్‌పేట వద్ద రైల్వే గేటు వేస్తున్నా ఆగని ప్రయాణికులు


ఆకివీడులో రైలు వెళుతున్న సమయంలో రైల్వేగేటు దూకి పట్టాలు దాటుతున్న యువకులు

ఏలూరు క్రైం/ భీమవరం క్రైం/ ఆకివీడు /భీమడోలు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రైల్వే గేట్లు ఉన్నా వాటిని వేయడానికి ఉన్న సిబ్బంది నిత్యం పడుతున్న నరకయాతన అంతా ఇంతా కాదు. వారు సైరన్ కొడుతూ గేటు వేసే ప్రయత్నం చేస్తుంటే ఎవరో ఒకరు వాహనదారులు వచ్చేస్తున్నారు. వారిని పంపించడానికి గేటు కాస్త పైకి ఎత్తితే మరొకరు వచ్చేస్తున్నారు. ఈ లోపు వేగంగా రైలు రానే వచ్చేస్తుంది. కొన్ని ప్రాంతాల్లో రైల్వే గేటు వేసి ఉన్నా వాటి కిందనుంచి వాహనాలను వాలుగా వంచి వెళ్ళిపోతున్నారు. ఇలాంటి సమయంలో కూడా ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఏలూరు జిల్లాలో అత్యధికంగా ఏలూరు వపర్‌పేట గేటు, భీమడోలు గేటు, నూజివీడు గేటు వద్దే ప్రమాదాలు జరుగుతున్నాయి. గత ఏడాది రైలు ప్రమాదాల్లో 22 మంది మరణించగా 12 ప్రమాదాలు గేటు వద్ద జరిగి 12 మంది ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు 25 మంది రైలు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోగా రైల్వే గేట్ల వద్ద జరిగిన ప్రమాదాల్లో 15 మంది మృత్యువాతపడ్డారు. పశ్చిమగోదావరి జిల్లాలో గవర్నమెంట్ రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో గత రెండేళ్లలో రైల్వే గేట్ల వద్ద 55 మరణాలు సంభవించాయి. భీమవరం, తణుకు, నరసాపురం, కైకలూరు తదితర రైల్వే స్టేషన్ల ప్రాంతాలు ఈ పరిధిలో ఉన్నాయి.

- ఆకివీడు రైల్వే స్టేషన్‌లో రైళ్లు వెళ్ళడానికి రెండు ప్లాట్‌ఫాంలు ఉన్నాయి. రైల్వేగేటు వేసి ఉన్న సమయంలో ఒక ప్లాట్‌ఫాం నుంచి రైలు వెళుతుండగానే గేటు దాటుకొని కొందరు రెండవ ప్లాట్‌ఫాం మీద నుంచి వెళుతున్నారు. ఒక పట్టాపై రైలు వెళుతుండగా వేరే పట్టాలపై నడుస్తున్న సమయంలో ఆ పట్టాపై కూడా రైలు వస్తే అనుకోకుండా ప్రమాదం జరుగుతుంది.
- భీమడోలు రైల్వేగేటు నుంచి ద్వారకాతిరుమల, కొవ్వూరు, రాజమండ్రితోపాటు తాడేపల్లిగూడెం వైపు నిత్యం వేల సంఖ్యలో వాహనాలు, ప్రయాణిస్తుంటాయి. దీంతో గేటు పడిన సమయంలో ఈ ప్రాంతంలో ట్రాఫిక్ నిలిచిపోతుంది. రైల్వే గేటు వేసిన సమయంలో చిన్న వాహనాలు గేటు కింద నుంచి వెళ్ళడం, ప్రజలు గేటు కింద నుంచి ట్రాక్ దాటడం వంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఈవే ప్రమాదాలకు దారితీస్తున్నాయి.


పవర్‌పేట వద్ద గేటు వేస్తున్నా ఆగని ఆటోలు

క్షణం తీరికలేని జీవితం. ఉన్న సమయంలోనే ఉరుకులు, పరుగులు. ఆలోచన లేని ప్రయాణాలు. గతంలో ఏకాగ్రతతో ప్రయాణం చేసేవారు. కానీ నేడు ఒంటరిగా వాహనంపై ప్రయాణం చేసినా సెల్‌ఫోన్ మహత్యమా అని ఊహల్లోనూ, మాటల్లోనూ ఎక్కడికో తేలిపోతూ ఎదురు ఉన్న ప్రమాదాలను పసిగట్టలేక ప్రాణాలే కోల్పోతున్నారు. ఇలాంటి ప్రమాదాలు నిత్యం ఎక్కడో చోట జరుగుతూనే ఉన్నాయి. ఒక నాడు రైళ్ళు బొగ్గు ఇంజన్లతోనూ, ఆతరువాత డీజిల్ ఇంజన్లతోనూ నడిచేవి. అవి వేగం తక్కువతోనే ఎక్కువ శబ్దంతోనూ నడిచేవి. కానీ నేడు టెక్నాలజీ అభివృద్ధితో విద్యుత్ రైళ్ళు నిశ్శబ్దంగా అత్యంత శక్తివంతమైన వేగంతో ప్రయాణిస్తున్నాయి. రైళు ప్రస్తుతం 120 కిమీటర్ల వేగంతో ప్రయాణిస్తున్నాయి. పట్టాలు దాటేలోపే ఆ రైళ్ల దాటే వారి మీద నుంచి వెళ్ళిపోతున్నాయి

స్పోర్ట్స్ కార్నర్

వచ్చే నెలలో పారా అథ్లెటిక్స్ పోటీలు

ఏలూరు అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాలు గల (సీడబ్ల్యుఎస్ఎన్)పిల్లలకు సబ్‌జూనియర్, జూనియర్ (అండర్-17, 20)విభాగాల్లో పారా అథ్లెటిక్స్ పోటీలు డిసెంబరు మొదటి వారంలో నిర్వహించడానికి సమగ్రశిక్ష విలీనవిద్య(ఐఈ)జిల్లా అధికారులు కార్యాచరణను రూపొందిస్తున్నారు. రన్నింగ్, లాంగ్‌జంప్, హైజంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, జావెలిన్‌త్రో, క్లబ్‌త్రో ఈవెంట్లలో బాలబాలికలకు వేర్వేరుగా ఈ పోటీలు నిర్వహిస్తారు. జిల్లాకేంద్రంలో ఒకేరోజున నిర్వహించేలా ప్రణాళిక రూపొందించారు. పోటీలను పరిశీలించేందుకు స్టేట్ అబ్జర్వర్లుగా పి.వనజ, వై.నరసింహంలను సమగ్రశిక్ష రాష్ట్ర అదికారులు నియమించారు. ఆయా ఈవెంట్లలో ప్రతిభ కనబరిచిన అథ్లెట్లను రాష్ట్రస్థాయి మీట్‌కు పంపేందుకువీలుగా ఏపీ పారా ఒలింపిక్స్ అసోసియేషన్ ప్రతినిధులు పర్యవేక్షిస్తారు. అన్ని ఈవెంట్లలో తొలి మూడుస్థానాల్లో నిలిచిన విజేతలకు పతకం, ప్రశంసా పత్రాలను అందిస్తారు. పారా అథ్లెటిక్స్ జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొనే సీడబ్ల్యుఎస్ఎన్ విద్యార్థులందరికీ టీషర్ట్‌లను పంపిణీచేస్తారు. ప్రభుత్వ యాజమాన్యంలోని అన్ని పాఠశాలలు, ఇంటర్మీడియట్ కళాశాలల బాలబాలికందరూ(సీడబ్ల్యుఎస్ఎన్)పాల్గొనేందుకు అర్హత కల్పిస్తారు.

టీచర్లకు ఆటల పోటీలు

ఏలూరు అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు ఆటల పోటీలు నిర్వహించడానికి విద్యాశాఖ నిర్ణయించింది. పురుష టీచర్లకు క్రికెట్, మహిళా టీచర్లకు త్రోబాల్ పోటీలు జరుగుతాయి. నిర్ణీత షెడ్యూలుప్రకారం మండల స్థాయిలో ఈ నెల 29, 30తేదీల్లో ఈ పోటీలు జరగాల్సిఉండగా, నిర్వహణ బాధ్యతలు చూడాల్సిన స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జిల్లా ప్రతినిధులు వివిధ స్టేట్ టోర్నమెంట్లలో వున్నందున తేదీలను కొద్దిరోజుల్లో ఖరారుచేస్తారు. మండలస్థాయి విజేతలతో డివిజన్ పోటీలు, అక్కడి విజేతలతో డిసెంబరు 20, 21, 22 తేదీల్లో జిల్లాస్థాయి పోటీలు, జనవరి 2, 3, 4 తేదీల్లో రాష్ట్రస్థాయి ఆటల పోటీలను నిర్వహించనున్నారు. పోటీల నిర్వహణకు ప్రభుత్వం జిల్లాకు నిధులను విడుదల చేసింది.

ముగిసిన వాలీబాల్ పోటీలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

దెందులూరు, నవంబరు27 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ్య విశ్వ విద్యాలయ అంతర్ కళాశాలల మహిళల వాలీబాల్ పోటీలు ముగిశాయి. ముగింపు రెండవ రోజు వ్యాయామ కాలేజీలో జరిగింది. బుధవారం గోపన్నపాలెంలో ప్రిన్సిపాల్ డాక్టర్ నతానియాల్‌తో కలిసి దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ప్రారంభించిన సంగతి తెలిసిందే. మహిళా క్రీడాకారులు వారి పాదాలకు షూ లేకుండా ఉండటాన్ని గమనించిన ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ గురువారం చింతమనేని ఛారిటబుల్ ట్రస్టు ద్వారా సొంత నగదు లక్ష రూపాయలతో 90 మందికి షూ, సాక్స్‌లను అందజేశారు. వారికి భోజన వసతి కల్పించారు. అనంతరం ఆదికవి నన్నయ్య యూనివర్శిటీ తరుపున వాలీబాల్ మహిళ జట్టుకు 20 మందిని ఎంపిక చేశారు. వారికి వారం రోజుల పాటు శిక్షణ ఇచ్చి 12 మందిని ఎంపిక చేయడం జరుగుతుందని వారిని చెన్నైలో అంత రాష్ట్ర వాలీబాల్ పోటీలు డిసెంబర్ 15 తేదీన జరిగే పోటీల్లో ఎంపికైన వారు పాల్గొంటారని ప్రిన్సిపాల్ నతానియాల్ తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు చింతా సుబ్బారావు, మాజీ సర్పంచ్ కొండేటి హనుమంతు, తోట రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ వై.పోలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు



జూడో పోటీలకు శనివారపుపేట విద్యార్థులు

ఏలూరు రూరల్, నవంబరు 27, (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి జూడో పోటీలకు శనివారపుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో అండర్ 14 బాల బాలికల పోటీల్లో ఎం. అభిరామ్, డి.గౌరీశ్వరరావు, పి.జస్వంత్‌కుమార్, డి.జాన్సన్, ఎ. తులసీ తరుణ్‌కుమార్, బి.భరత్‌కుమార్, సుంకర మోహన శివకృష్ణ, సీహెచ్ జయ రమ్యశ్రీ, డి.స్వాతి, ప్రతిభ కనబరిచారు. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం మండలం సిగిచర్లలో ఈనెల 28 నుంచి జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు వీరిని ఎంపిక చేశారు.


స్వామినాయుడుని అభినందిస్తున్న పాఠశాల డైరెక్టర్

ఈత పోటీల్లో శ్రీసూర్య విద్యార్థికి ఐదు స్వర్ణాలు

ఏలూరు రూరల్, నవంబరు 27, (ఆంధ్రజ్యోతి): ఇటీవల విశాఖపట్నంలో జరిగిన సౌత్‌జోన్ స్టేట్ మీట్ ఈత పోటీలలో తంగెళ్ళమూడి శ్రీసూర్య పాఠశాల విద్యార్థి బలగ స్వామినాయుడు ఐదు స్వర్ణ పతకాలు సాధించాడని స్కూల్ డైరెక్టర్ కొండపల్లి చంద్రశేఖర్‌రావు తెలిపారు. దేశం తరుపున ఒలంపిక్స్‌లో పతకం సాధించాలన్నదే తన లక్ష్యమని స్వామినాయుడు పేర్కొన్నారు. అలాగే స్వామినాయుడు సోదరి భార్గవి కూడా ఇదే పోటీలలో కాంస్య పతకం సాధించడం విశేషం.

వరి కోత మిషన్ల కొరత

నష్టపోతున్నామని రైతుల ఆవేదన


బర్రింకలపాడు వద్ద ఎండి పోతున్న వరిచేను

జీలుగుమిల్లి, నవంబరు 27 : (ఆంధ్రజ్యోతి) : కష్టపడి వరి పండించిన రైతులకు సరైన సమయంలో కోతలు జరక్క నష్టాల పాలవుతున్నారు. ప్రస్తుతం వరి కోతలు ముమ్మరంగా ఉండటంతో కోత మిషన్‌లు దొరక్క పంట కోతల సమయం దాటి పంట నేలపాలవుతుందని, వరి కంకులు ఎండిపోయి ధాన్యం గింజలు రాలిపోతున్నాయని తాటియాకులగూడెం రైతులు వాపోతున్నారు. మరోవైపు కోత మిషన్ ఏజెంట్‌లు కుమ్మక్కై పంట కోతలకు ఇతర ప్రాంతాల నుంచి మిషన్‌లు రాకుండా కట్టడి చేస్తున్నారు. దీంతో గంటలకు టైర్ మిషన్‌కు రూ.2500, చైన్‌మిషన్‌కు రూ.4000 వేలు చొప్పున రైతుల నుంచి వరికోత కిరాయి వసూలు చేస్తున్నారు. మరో వైపు ఒక ఎకరంలో వరి పండించిన రైతులు వరి కోత మిషన్ కోసం పడిగాపులు పడాల్సి వస్తోంది. వారం పది రోజులపాటు మిషన్‌ల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. చెరువులు కాలువల ఆయకట్టు ప్రాంతంలో వరి పండించిన రైతులు ఆయా నెలల్లో తేమ శాతం ఉండటంతో వరికోత మిషన్‌లు రాక మరో పంట (రెండో పంట) వేసేందుకు అదును దాటి పోతుందని వాపోతున్నారు. వరికి గిట్టు బాటు ధర కల్పించి ఆర్ఎస్‌కెల ద్వారా పంటను కొనుగోలు చేస్తున్న ప్రభుత్వం సకాలంలో పంట కోతలు జరిగేలా చూడాలని రైతులు వేడుకుంటున్నారు.

'నకిలీ సర్టిఫికెట్లు లేవు.. లక్ష్మయ్య ఆరోపణలు దుర్మార్గం'

ఏలూరుటూటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సచివాలయంలో పశుసంవర్థక శాఖ సహాయకుల సర్టిఫికెట్లలో ఎటువంటి తేడాలు లేవని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నాన్‌గ్రాడ్యుయేట్ వెటర్నేరియన్ ఫెడరేషన్ చైర్మన్ ఎం.గణేశ్ అన్నారు. ఏలూరు వెటర్నరీ జేడీ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సచివాలయ పశుసంవర్ధక శాఖ సహాయకులు రాష్ట్ర వ్యాప్తంగా 1200మంది నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందారని రాష్ట్ర వెటర్నరీ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ బీవీ.లక్ష్మయ్య చేసిన ఆరోపణలను ఖండిస్తున్నామన్నారు. ఆ ప్రకటన వెటర్నరీ అసిస్టెంట్ల మనోభావాలను దెబ్బతీసిందన్నారు. ఆరేళ్ల క్రితం ప్రభుత్వం పోటీ పరీక్ష నిర్వహించిన తరువాత కలెక్టర్ ఆదేశాల మేరకు పశుసంవర్ధక శాఖ అధికారులతో సర్టిఫికెట్లు పరిశీలించిన తరువాత ఉద్యోగాలు ఇచ్చారన్నారు. ఈ సమయంలో డాక్టర్ లక్ష్మయ్య వెటర్నరీ అసిస్టెంట్లపై తీవ్ర ఆరోపణలు చేయడం దుర్మార్గమని, అతడిపై పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ విచారణ చేసి చర్యలు తీసుకోవాలన్నారు. లేనియెడల ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సెక్రటరీ ఎం.బాబూరావు, ఏహెచ్‌ఏ అసోసియేషన్ అధ్యక్షులు కిషోర్, వీఎల్‌వో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఫణికుమార్ పాల్గొన్నారు.

రేపు బొర్రంపాలెంలో ఫుడ్ ఫెస్టివల్

ఏలూరు అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి):పోషక విలువలతో కూడిన ఆహారోత్పత్తులను మధ్యాహ్నభోజన పథకంలో భవిష్యత్తులో ప్రవేశపెట్టే సన్నాహాల్లో భాగంగా ఈనెల 29న టి.నరసాపురం మండలం బొర్రంపాలెం జడ్పీ హైస్కూలులో ఫుడ్ ఫెస్టివల్ కం ఎగ్జిబిషన్‌ను నిర్వహించనున్నారు. ఇటీవల సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో వృత్తి విద్యాకోర్సులను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఏలూరులో నిర్వహించిన పోటీల్లో బొర్రంపాలెం జడ్పీ హైస్కూలు విద్యార్థులు ఫుడ్ ప్రాసెసింగ్ విభాగంలో ప్రదర్శనకు పెట్టిన ఆహారోత్పత్తులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయి. పూర్తిగా చిరు .దాన్యాలతో తయారు చేసిన ఈ ఆహారోత్పత్తులనే రాష్ట్రమంతటా పరిచయం చేసేందుకు ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఒకేషనల్ విద్య బోధిస్తున్నచోట విద్యార్థులతో శనివారం ఫుడ్ ఫెస్టివల్ కం ఎగ్జిబిషన్‌ను నిర్వహించాలని గురువారం విద్యాశాఖ మధ్యాహ్న భోజన పథకం విభాగం రాష్ట్ర ఉన్నతాధికారులు వీడియో కాన్ఫరెన్సులో ఆదేశించారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారంపై అవగాహన

ఫుడ్ ఫెస్టివల్‌లో వంటనూనె, పంచదార, మైదా లేకుండా డ్రైఫ్రూట్స్, పండ్లు, చిరుధాన్యాలతో లడ్డూ, హల్వావంటివి తయారు చేయాల్సి ఉంటుంది. బెల్లం, నెయ్యి వంటివి ఉపయోగించవచ్చు. స్కూలు ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసే కౌంటర్లలో విద్యార్థులే స్వయంగా విభిన్న రకాల ఆహార పదార్థాలను అందరి ఎదుట ప్రత్యక్షంగా తయారుచేస్తారు. దీనివల్ల విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆరోగ్యకరమైన నాణ్యతతో కూడిన పౌష్టికాహారంపై అవగాహన ఏర్పడుతుందని విద్యాధికారులు వివరించారు. మొత్తం ఐదు రకాల ఆహారపదార్థాల తయారీకి అవసరమైన ముడి సరుకుల కోసం రూ.6 వేలను సమగ్రశిక్ష మంజూరుచేసింది. ఫుడ్ ఫెస్టివల్‌ను తిలకించేందుకు మధ్యాహ్న భోజన పథకం రాష్ట్ర అధికారుల బృందం, పాఠశాల విద్య కాకినాడ ఆర్జేడీ, జిల్లా విద్యాధికారులు హాజరవుతారు.

హీరోహోండా షోరూమ్ అధినేత 'వంటెద్దు' మృతి


సోమసుందరావు (ఫైల్)

తణుకు, నవంబరు27(ఆంధ్రజ్యోతి):తణుకు పట్టణానికి చెందిన ప్రముఖ మోటారు వ్యాపారవేత్త, హీరోహోండా షోరూమ్ వ్యవస్థాపక అధినేత వంటెద్దు సోమసుందరరావు (77) గురువారం పైడిపర్రులోని ఆయన నివాసంలో మృతి చెందారు. ఆయన భార్య ధనకస్తూరిభాయి గతంలోనే మృతి చెందారు. కుమా రుడు వంటెద్దు రాజా ప్రస్తుతం టీడీపీ పట్టణ ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. కుమార్తె పుత్సల కాశీ అన్నపూర్ణదేవి, మనుమడు వంటెద్దు వెంకట్, మనుమరాండ్రు ఉన్నారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో ఉంటూ ఇంటి వద్దే వైద్య సేవలు అందుకుంటున్నారు. ఆయన తండ్రి వంటెద్దు సుబ్బారావు కాంగ్రెస్ పార్టీ తణుకు పట్టణ అధ్యక్షుడిగా పనిచేశారు. ఆయన మృతి పట్ల ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, మాజీ ఎమ్మెల్యే ముళ్ళపూడి వెంకట కృష్ణారావు, ఏఎంసీ చైర్మన్ కొండేటి శివ, టీడీపీ నాయకులు డాక్టర్ దొమ్మేటి వెంకటసుధాకర్, బసవా రామకృష్ణ, పరిమి వెంకన్నబాబు, కలగర వెంకటకృష్ణ, ఒమ్మి రాంబాబు, మంత్రిరావు వెంకటరత్నం, తాతపూడి మారుతీరావు, గుమ్మళ్ళ హనుమంతరావు సంతాపం వ్యక్తం చేసి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

ఎరువుల షాపులో విజిలెన్స్ తనిఖీలు


ఎరువుల షాపులో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

చాట్రాయి, నవంబరు 27 (ఆంధ్ర జ్యోతి): చాట్రాయిలోని ఓ ప్రైవేటు ఎరువులు పురుగు మందుల షాపులో గురువారం సాయంత్రం విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఎస్సై కే నాగరాజు, ఏవో మీరయ్య ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలలో మొ క్కజొన్న విత్తనాల నిల్వలలో వ్యత్యా సం ఉండటంతో రూ. 3.90 లక్షల విలువైన 6.86 క్వింటాళ్ళ మొక్కజొన్న విత్తనాల అమ్మకాలను నిలుపుదల చేసి, నిత్యావసరాల చట్టం-1955 యాక్ట్ ప్రకారం 6ఏ కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ ఎస్సై నాగరాజు తెలిపారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు ఖచ్చితంగా బిల్లులు తీసుకోవాలని విజిలెన్స్ ఎస్సై కోరారు. తనిఖీలలో చాట్రాయి ఏవో శివశంకర్ పాల్గొన్నారు.

నాలుగు లేబర్‌కోడ్‌లు రద్దు చేయాలని ధర్నా



ఏలూరు కార్పొరేషన్, నవంబరు 27 (ఆంధ్ర జ్యోతి): కార్మికులకు హాని చేసే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ గురువారం స్థానిక వసంతమహల్ సెంటర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. కార్మికులకు, రైతాంగానికి, వ్యవసాయ కూలీలకు, ప్రజలకు నష్టం చేకూర్చే నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.రామకృష్ణ, కె.శ్రీనివాస్, పిచ్చుక ఆదిశేషు, ఇస్సాకు, కోటేశ్వరరావు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న 44 కార్మిక చట్టాల్లో ప్రధానమైన 29 చట్టాలను రద్దు చేసి కార్పొరేట్‌లు, పెట్టుబడిదారి యజమానులకు మేలు చేసే విధంగా మోదీ ప్రభుత్వం చర్యలు తీసుకున్నదన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను వదిలేసి ఎనిమిది గంటల పని విధానాన్ని 12 గంటలకు పెంచుతూ అసెంబ్లీలో కూటమి ప్రభుత్వం తీర్మానం చేయడం దుర్మార్గమన్నారు. యావత్ కార్మిక లోకానికే తీరని అన్యాయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు వై.ఎస్.కనకారావు, జె.గోపి, అరుణకుమారి, జి.కోటేశ్వరరావు, చింతాడ లక్ష్మి, మీసాల సత్యం, జి.యేసుబాబు, సి.హెచ్.అమర్‌కుమార్, ఎస్.సత్యనారాయణ పాల్గొన్నారు.

'నూజివీడు'ను ఎన్టీఆర్ జిల్లాలో కలపాలి

» జేఏసీ ఆధ్వర్యంలో నిరసన దీక్షలు



నూజివీడులో నిరసన దీక్ష చేస్తున్న జేఏసీ నాయకులు

నూజివీడు టౌన్, నవంబరు27(ఆంధ్రజ్యోతి):నూజివీడు నియోజక వర్గాన్ని ఎన్టీఆర్ జిల్లాలో కలపాలని నూజివీడు జేఏసీ ఆధ్వర్యంలో నిరసన దీక్షలు చేపట్టారు. గురువారం ఈ దీక్షలను నూజివీడు జేఏసీ గౌరవ అధ్యక్షుడు చలసాని వెంకటరామారావు, కేడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ కొమ్మన నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా చలసాని రామారావు మాట్లాడుతూ నియోజకవర్గాన్ని ఎన్టీఆర్ జిల్లాలో కలపాలని, గతంలో కరోనా కాలంలో ఎన్నో పోరాటాలు చేశామని, గత వైసీపీ ప్రభుత్వంలో జిల్లాల పునర్విభజనలో నూజివీడును ఏలూరు జిల్లాలో కలపడాన్ని వ్యతిరేకిస్తూ ఏడాదిపాటు పెద్దఎత్తున ప్రజా పోరాటం చేశామన్నారు. దీనిలో భాగంగా ధర్నాలు, నిరాహార దీక్షలు, 72 గ్రామాల్లో జీపు యాత్రతోపాటు లక్ష కరపత్రాల పంపిణీ, 25 వేల సంతకాల సేకరణ, ప్రజా బ్యాలెట్ నిర్వహించి నూజివీడు నుంచి విజయవాడకు పాదయాత్రగా వెళ్లి అప్పటి కలెక్టర్‌కు వినతిపత్రం అందించామన్నారు. నూజివీడు జేఏసీ అధ్యక్షుడు మరిడు శివరామకృష్ణ, నూజివీడు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఇందుపల్లి సత్యప్రకాష్ మాట్లాడుతూ గతంలో ప్రతిపక్షనేతగా ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 2023లో అంబేద్కర్ జయంతి సందర్భంగా నూజివీడు వచ్చినప్పుడు, 2024 ఎన్నికల ప్రచార సభకు వచ్చినప్పుడు బహిరంగ సభలో హామీ ఇచ్చారన్నారు. నూజివీడు ప్రజల ఆకాంక్షలు ఇక్కడ పుట్టి పెరిగిన వారికి మాత్రమే తెలుస్తాయని, దీనికి భిన్నంగా ఎవరు వ్యవహరించినా ప్రజల ఆగ్రహా నికి గురికావడం తప్పదన్నారు. ఇప్పటికైనా సానుకూలంగా నూజివీడును ఎన్టీఆర్ జిల్లాలో కలిపి పూర్వవైభవం వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పీపుల్స్ ఫోరం నాయకులు పిన్నమనేని కుమార్, సబ్బినేని శ్రీనివాస్, సిద్దార్థ రవి, రాజశేఖర్, ఫరూక్, నూజివీడు జేఏసీ కోశాధికారి చాట్ల పుల్లారావు, జేఏసీ నాయకులు ఎం.సునీల్‌కుమార్, ఎర్రంశెట్టి రాము, నూజివీడు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మన్నవ రమేష్ తదితరులు పాల్గొన్నారు.


కైకలూరులో పెట్రోలు బంకును ప్రారంభిస్తున్న అంజనీకుమార్‌యాదవ్

పెట్రోలు బంకులతో జైళ్లశాఖ బలోపేతం

» జైళ్లశాఖ డీజీపీ అంజనీకుమార్ యాదవ్

కైకలూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి):పెట్రోలు బంకుల నిర్వహణ వల్ల జైళ్లశాఖ ఆర్థికంగా బలోపేతం అవుతుందని, తద్వారా ఆదాయ వనరులను సమకూరుస్తున్నామని రాష్ట్ర జైళ్లశాఖ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్ అంజనీకుమార్ యాదవ్ అన్నారు. గురువారం కైకలూరు సబ్‌జైల్ ప్రాంగణం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన హెచ్‌పీ పెట్రోలు బంకును ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 23 పెట్రోలు బంకులను జైళ్ల శాఖ ద్వారా ఏర్పాటు చేశామని వీటిని ఆదర్శంగా తీసుకుని ఇతర రాష్ట్రాల్లో పెట్రోలు బంకుల నిర్మాణాన్ని చేపట్టిందన్నారు. ఖైదీల్లో నైపుణ్యాభివృద్ధి పెరుగుతుందని సమాజసేవ కేంద్రాలుగా మార్చేందుకు దోహదపడుతుందన్నారు. జైళ్లలో ఖైదీల శిక్షాకాలంలో ఇలాంటి వాటిపై నైపుణ్యత సాధించి సమాజంలో తిరిగి కలిసిపోవడానికి మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమాలలో జైళ్లశాఖపై ప్రజల్లో సానుకూల అభిప్రాయం ఏర్పడుతుందని, పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యం ద్వారా సంస్కరణాత్మక సామాజిక సంక్షేమ కార్యక్రమాలు బలపడతాయన్నారు.

అనంతరం రూ.1.90 కోట్లతో నిర్మాణం చేసే కైకలూరు సబ్‌జైలును పరిశీలించారు. పనుల నిర్వహణలో కాంట్రాక్టరు టైల్స్ వేయకుండా ఫ్లోరింగ్ చేయడంపై అసహనాన్ని వ్యక్తం చేశారు. టెక్నాలజీ పెరుగుతున్న రోజుల్లో జైళ్ళల్లో కూడా మార్పులు తీసుకువచ్చామని ఫ్లోరింగ్ అంతా టైల్స్ నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. గుంటూరు రేంజ్ జైళ్లశాఖ డీజీపీ డాక్టర్ వరప్రసాద్, విజయవాడ సబ్‌జైల్ అధికారి ఎన్.శివశంకర్, ఏలూరుజిల్లా జైల్ సూపరింటెండెంట్ స్వామి, మచిలీపట్నం జిల్లా జైల్ సూపరింటెడెంట్ పిల్లా రమేష్, కృష్ణాజిల్లా సబ్‌జైల్ అధికారి ఉమామహేశ్వరరావు, కైకలూరు సబ్‌జైల్ సూపరింటెండెంట్ బొత్స అప్పారావు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థుల కోసం
వంద రోజుల కార్యాచరణ !


» టెన్త్ సబ్జెక్ట్ టీచర్లకూ రేటింగ్ ! » అవసరమైతే ఆదివారాల్లోనూ 'పది' ప్రత్యేక తరగతులు

ఏలూరు అర్బన్, నవంబరు 27 (ఆంధ్ర జ్యోతి) : పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్న బాల బాలికలకు డిసెం బరు 6 నుంచి వరుసగా 100 రోజులపాటు నిర్వహించనున్న ప్రత్యేక తరగ తుల మాదిరిగానే ప్రాథమిక పాఠశాలల విద్యా ర్థులకు కూడా వందరోజుల కార్యాచరణను అదేరోజు నుంచి ప్రారంభించనున్నారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు చదువుతున్న బాలబాలికలు లాంగ్వేజి, గణితం సబ్జెక్టుల్లో కనీస సామర్థ్యాలు సాధిస్తున్నదీ, లేనిదీ తెలుసుకునేందుకు పాఠశా లల వారీగా ప్రస్తుతం జరుగుతోన్న ఎఫ్‌ఎల్‌ఎన్ (ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ) సర్వే ఫలితాల ఆధారంగా ఆయా సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులకు అదనపు తర్ఫీదునిచ్చేందుకే వందరోజుల కార్యాచరణను నిర్దేశించారు. పదో తరగతి విద్యార్థులకు వంద రోజుల కార్యాచరణలో రోజూ ఉదయం, సాయంత్రం ఒక గంటచొప్పున ప్రత్యేక తరగతులు నిర్వహించడం కాకుండా, ప్రాథమిక తరగతులకు సంబంధించి చదువులో వెనుకబడినట్టుగా ఎఫ్‌ఎల్‌ఎన్ సర్వేలో గుర్తించిన బాలబాలికలకు ప్రత్యేక తర్ఫీదును నిర్ణీత బడి సమయంలోనే ఇవ్వాల్సి ఉంటుంది. మొత్తం మీద విద్యార్థి ఐదో తరగతి చదువు ముగించుకుని పాఠశాలను విడిచి పెట్టేలోగా లాంగ్వేజి సబ్జెక్టులు, గణితంలో చదవడం, రాయడం సామర్థ్యాలు సాధించేలా చేయడమే ప్రాథమిక తరగతుల విద్యార్థులకు వందరోజుల కార్యాచరణ ప్రణాళిక ముఖ్య ఉద్దేశమని అధికారులు వివరించారు.

సబ్జెక్టుల వారీగా టీచర్లకు రేటింగ్ !

పదో తరగతి పరీక్షల ఫలితాల ఆధారంగా సబ్జెక్టుల వారీగా టీచర్లకు ర్యాంకు/రేటింగ్ ఇవ్వనున్నారు. ఇప్పటివరకు అమల్లోవున్న విధానం ప్రకారం టెన్త్ ఉత్తీర్ణతలో జిల్లాలకే ర్యాంకులుండేవి. ఇక మీదట జిల్లా ఉత్తీర్ణతా శాతాన్ని సగటుగా తీసుకుని, దానిని సబ్జెక్టుల వారీగా టీచర్లకు ప్రామాణికంగా తీసుకుని రేటింగ్/ర్యాంకు ఇస్తారని విద్యాశాఖవర్గాలు తెలిపాయి. టెన్త్ పరీక్షార్థులకు డిసెంబరు ఐదో తేదీలోగా సిలబస్‌ను ఎట్టిపరిస్థితుల్లోనూ పూర్తి చేయాల్సిందేనని, అవసరమైతే ఆదివారాల్లో సైతం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. ఆ మరుసటి రోజు నుంచే అంటే డిసెంబరు 6 నుంచి ఉదయం, సాయంత్రం అదనపు తరగతులు వంద రోజులపాటు నిర్వహించేలా కార్యాచ రణను ప్రారంభిస్తారు. కార్యాచరణ ప్రారం భానికి ముందే విద్యార్థులను సామర్థ్యాలకు అనుగుణంగా నాలుగు గ్రూపులుగా విభజిస్తారు. ఏ, బీ గ్రూపుల విద్యార్థులను షైనింగ్ స్టార్స్‌గాను, సి, డీ గ్రూపుల విద్యార్థులను రైజింగ్ స్టార్స్‌గాను విభజించి తర్ఫీదునిస్తారు.

శ్రీవారి అంతరాలయ దర్శనం పునఃప్రారంభం



ద్వారకా తిరుమల, నవంబరు 27 (ఆంధ్ర జ్యోతి): కరోనా మహమ్మారి ప్రవేశం తర్వాత దాదాపు ఐదేళ్ల అనంతరం ద్వారకాతిరుమల వేంకటేశ్వరాలయంలో అంతరాలయ దర్శనాన్ని అధికారులు గురువారం పునఃప్రారంభించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు సంతో షాన్ని వ్యక్తం చేశారు. ప్రతీ భక్తునికి అంతరాల య దర్శనం నిమిత్తం టిక్కెట్టు రుసుమును రూ. 500గా అధికారులు నిర్ణయించి అమలు చేశారు. భక్తులు అంతరాలయం ద్వారా స్వామి వారి మూల విరాట్‌ను దర్శించుకునేందుకు ఉవ్విళ్లూరారు. ఈక్రమంలో ప్రారంభం రోజైన గురువారం 610 మంది అంతరాలయ దర్శనం టిక్కెట్లు తీసుకున్నట్టు ఆలయ ఈవో సత్యనారాయణమూర్తి తెలిపారు.


గోపవరంలో కౌన్సెలింగ్ చేస్తున్న అధికారులు

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

ముసునూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ముసునూరు మండలం గోపవరంలో బాల్య వివాహాన్ని గురువారం అధికారులు అడ్డుకున్నారు. 15 ఏళ్ల యువతికి, 22 ఏళ్ల యువకుడికి వివాహం జరుగుతుందని హెల్ప్‌లైన్ నంబరుకు వచ్చిన సమాచారం రావడంతో హెల్ప్‌లైన్ జిల్లా కో-ఆర్డినేటర్ రవికుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి బాల్య వివాహాన్ని అడ్డుకున్నారు. యువతికి, ఆమె తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలు చేసిన, పోత్సహించిన చట్ట రీత్యా నేరమని అధికారులు హెచ్చరిం చారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ సంధ్యారాణి, అంగన్‌వాడీ కార్యకర్త, ఆశావర్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రాలో ఆక్వాసాగు భేష్



మండవల్లి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఆంధ్రాలో ఆక్వాసాగు భేష్‌గా ఉందని ఝార్ఖండ్ రైతులు తెలిపారు. మండవల్లి మండలం చింతపాడులో గురువారం రొయ్యలు చేపల సాగును ఝార్ఖండ్‌లోని బొకారో జిల్లాకు చెందిన 16 మంది రైతులు క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. చేపలు, రొయ్యలు ఎంతకాలంలో పెరుగుతాయి? లాభనష్టాలు తదితర వివరాలను రైతుల నుంచి అడిగి తెలుసుకున్నారు.

రాగి వైర్ల చోరీ ముఠా అరెస్ట్

ముఠాలో ఇద్దరు మహిళలు


నిందితులను అరెస్టు చేసి విలేకరులకు వివరాలు చెబుతున్న ఏఎస్పీ సుస్మిత

జంగారెడ్డిగూడెం,నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పంట పొలాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో రాగివైరు చోరీ చేస్తున్న ఐదుగురు నిందితులను తడికలపూడి పోలీసులు అరెస్ట్ చేశారు. జంగారెడ్డిగూడెం సర్కిల్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఎస్పీ సుస్మిత రామనాథన్ కేసు వివరాలు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పరిసర ప్రాంతాలకు చెందిన కెల్లా దుర్గా ప్రసాద్, షేక్ హిమత్, దేవకోటి రాజేశ్, కండెల జ్యోతి, వరంగల్ జిల్లాకు చెందిన కూరాకుల పద్మ కారులో వెళ్తుండగా తడికలపూడి ఎస్సై పి.చెన్నారావు కామవరపుకోట మండలం రావికంపాడు వద్ద గురువారం అరెస్ట్ చేసి వారి నుంచి రెండు కార్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అరెస్టయిన ఐదుగురు నిందితులతో పాటు పాల్వంచకు చెందిన కోటగట్టు నాగరాజు కలిసి ముఠాగా ఏర్పడి కామవరపుకోట మండలం రావికంపాడు శివారులోని లిఫ్ట్ ఇరిగేషన్‌కు చెందిన ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి వైరు దొంగిలించడానికి ఈ నెల 24 వ తేదీ రాత్రి కియా కారు, టయోటా కారులో వచ్చారు. ఈ క్రమంలో మిగిలిన ఐదుగురు వ్యక్తులు విద్యుత్ పాస్ అవుతుందని తెలిసి కూడా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పైకి కోటగట్టు నాగరాజును ఎక్కించారు. ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్ వైర్లు తప్పించే క్రమంలో నాగరాజు విద్యుత్ షాక్‌కు గురై కింద పడిపోయాడు. ముఠా సభ్యులు హుటాహుటిన కారులో జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో చేర్పించగా అప్పటికే నాగరాజు మృతి చెందాడని తెలుసుకుని నాగరాజు మృతదేహాన్ని ఆసుపత్రిలోనే విడిచి పరారయ్యారని ఏఎస్పీ తెలిపారు. ప్రమాదమని తెలిసినా నిర్లక్ష్యంగా వ్యవహరించి నాగరాజు మృతికి కారణమైన ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి జంగారెడ్డిగూడెం సీఐ ఎంవి.సుభాష్ దర్యాప్తు చేసినట్లు తెలిపారు. నిందితుల్లో ఏ-1 కెల్లా దుర్గా ప్రసాద్‌పై తెలంగాణలోని పాల్వంచ, ఎడ్లబయ్యారం పీఎస్‌లలో 13 కేసులున్నాయని, ఏ-4 కండెల జ్యోతి, ఏ-5 కూరాకుల పద్మలపై మెదక్‌లో ఒక కేసు ఉందని తెలిపారు.

గుండాట ఆడుతున్న ఐదుగురి అరెస్టు

టి.నరసాపురం, నవంబరు 27, (ఆంధ్రజ్యోతి) : గుండాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ ఎం.జయబాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం తెడ్లం గ్రామంలో గుండాట ఆడుతున్నారనే సమాచారంతో తన సిబ్బందితో గురువారం దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 3500 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

డివైడర్‌ను ఢీకొట్టిన లారీ


ధ్వంసమైన లారీ ముందు భాగం

ద్వారకాతిరుమల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూర్యచంద్రరావుపేట వద్ద గురువారం ఉదయం తౌడు లోడుతో వెళ్తున్న లారీ ఆర్టీసీ బస్సును తప్పించబోయి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీ ముందుభాగం పూర్తిగా ధ్వసం అయ్యింది. అయితే నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిపై ప్రమాద సమయంలో వాహనాలు లేవు. దీంతో ప్రాణనష్టం తప్పినట్లయ్యింది. అలాగే తప్పించబోయిన ఆర్టీసీ బస్సును ఈ లారీ ఢీకొని ఉన్నా పెనుప్రమాదం జరిగి ఉండేదని స్థానికులు అంటున్నారు. తణుకుకు చెందిన లారీ తౌడులోడుతో వరంగల్ నుంచి తణుకులోని ఓ ఫాక్టరీకి వెళ్తోంది. ఘటనా స్థలమైన సూర్యచంద్రరావుపేట వద్దకు వచ్చేసరికి ఆర్టీసీ బస్సును తప్పించబోయిన లారీ డ్రైవర్ వేగంగా డివైడర్‌ను ఢీకొట్టాడు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయండి
డీఎస్పీ శ్రావణ్ కుమార్



ఏలూరు క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వ్యాపార సంస్థలు, చిన్న మధ్య తరగతి వ్యాపార సంస్థలు తప్పనిసరిగా సీసీ కెమెరా లు ఏర్పాటు చేయాలని ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ సూచించారు. పబ్లిక్ సేఫ్టీ (మెజర్స్) ఎన్‌ఫోర్స్ మెంట్‌యాక్టు 2013 ప్రకారం నోడల్ అధికారి అయిన ఏలూరు డీఎస్పీ డి శ్రావణ్‌కుమార్ ఒక ప్రకటనలో పలు సూచనలు వ్యాపారస్తులకు తెలిపారు. వ్యాపార సంస్థలు, హోటళ్ళు, సినిమా హాల్స్ మాల్స్, చిన్న మధ్య తరగతి వ్యాపార సంస్థలు, వాటి యజమానులు తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. అంతేకాకుండా గృహ యజమానులు వారి ఇళ్లను అద్దెకు ఇచ్చే సమయంలో వలస కార్మికుల వివరాలు, అద్దెకు ఇచ్చే వారి వివరాలు ఖచ్చితంగా వారికి తెలిసి ఉండాలని లేదంటే ప్రైవేటు సంస్థల ద్వారా అయినా వారిపై విచారణ చేయించుకుని వివరాలు తెలుసుకోవాలని డీఎస్పీ సూచిం చారు. ఏలూరు జిల్లాలో ఇటీవల జరుగుతున్న సంఘటనల నేపథ్యంలో జిల్లా ప్రజల భద్రతను పటిష్ఠం చేయడానికి జిల్లా ఎస్పీ కేపీఎస్ కిషోర్ ఆదేశాల మేరకు పబ్లిక్ సేఫ్టీ (మెజర్స్) ఎన్‌ఫోర్స్‌మెంట్‌యాక్టు 2013 నిబంధనలను అమలు చేయడానికి చర్యలు చేపడుతున్నా మన్నారు. ఒక సీసీ కెమెరా పది మంది పోలీసులతో సమానమని సీసీ కెమెరాల వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయన్నారు. వ్యాపా ర సంస్థలు ఉద్యోగులను నియమించుకునే ముందు ఆ ఉద్యోగులకు సంబంధించి పోలీసు వెరిఫికేషన్ సర్టిఫికెట్లను పొందాలని సూచించారు. పోలీస్ వెరిఫికేషన్ లేకుండా ఎవరైనా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తే ఆ ఉద్యోగి ఏదైనా నేరాల్లో పాల్గొన్న ట్లయితే ఆ సంస్థ యజమానులపై పబ్లిక్ సేఫ్టీ ఎన్‌ఫోర్స్‌మెంట్‌యాక్టు కింద చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు. జిల్లాలో శాంతి భద్రతలు కాపాడడానికి ప్రతి ఒక్క పోలీసులకు సహకరించాలని అన్నారు.


గొడౌన్‌లోని గృహ నిర్మాణ సామగ్రిని తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే చంటి

గొడౌన్‌లో గృహ నిర్మాణ సామగ్రి

మూడేళ్లుగా దోచేస్తున్న గృహ నిర్మాణ సిబ్బంది

ఎమ్మెల్యే తనిఖీలో బయటపడ్డ రూ.8 కోట్ల సామగ్రి వ్యవహారం

ఏలూరు టూటౌన్, నవంబరు 27 (ఆంధ్ర జ్యోతి): అధికారుల నిర్లక్ష్యం వలన రూ.8కోట్లు విలువైన ప్రజాధనం దుర్వినియోగం అయ్యింది. ప్రభుత్వం పేదలకు నిర్మించే గృహాలకు చెందిన మెటీరియల్ మూడు సంవత్సరాలుగా గొడౌన్‌లో మగ్గుతున్నది. ఈ విషయాన్ని గృహనిర్మాణ అధికారులు ఎందుకు దాచి పెట్టారో తెలియదు. 2022వ సంవత్సరంలో పేదలకు గృహాలు నిర్మించడానికి వైసీపీ ప్రభుత్వం 8కోట్ల 25లక్షల విలువైన ఇంటిడోర్లు, ఫ్యాన్లు, వైర్లు, ఎల్‌ఈడీ బల్బులు గొడౌన్‌లో దాచి ఉంచారు. అనంతరం రెండు సంవత్సరాలు వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికి వాటిని ముట్టుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చి 16నెలలు గడుస్తున్నప్పటికి ఇంత వరకు హౌసింగ్ అధికారులు ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యేకి కూడా తెలియనివ్వలేదు. హౌసింగ్ అధికారులతో ఎన్నోసార్లు స్థానిక ఎమ్మెల్యే బడేటి చంటి మీటింగులుపెట్టినా ఆ సమావేశాల్లో కూడా తెలియనివ్వలేదు. 8కోట్ల 25లక్షల విలువైన సామగ్రి చాలా వరకు పాడైపోయింది. దీంతో పాటు ఇంటి దొంగలే ఇంటికి కన్నం వేసినట్లు హౌసింగ్ సిబ్బంది సామాన్లు దొంగిలిస్తున్నారు. ఈ విషయాన్ని పసిగట్టిన ఎమ్మెల్యే బడేటి చంటి క్యాంపు కార్యాలయ సిబ్బంది ఈ విషయాన్ని ఎమ్మెల్యే బడేటి చంటికి చేరవేశారు. వెంటనే ఎమ్మెల్యే బడేటి చంటి గొడౌన్‌కు వెళ్లి తనిఖీ చేయగా విషయం వెలుగులోకి వచ్చింది.

బాధ్యులపై కఠిన చర్యలు ఎమ్మెల్యే చంటి

ప్రజలకు చెందాల్సిన సొత్తును దొంగదారిలో కాజేసిన హౌసింగ్ ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే బడేటి చంటి హెచ్చరించారు. కొడేలులో గృహనిర్మాణ సామగ్రి దాచి ఉంచిన గొడౌన్‌ను ఎమ్మెల్యే తనిఖీ చేశారు. అక్కడ గొడౌన్‌లో దాచి ఉంచిన గృహ లబ్ధిదారులకు చెందిన మెటీరియల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి హౌసింగ్ అధికారులను ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వచ్చి 16 నెలలు గడిచిన గొడౌన్‌లో మేటిరియల్ ఉందని ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. వాటి లెక్కలపై అధికారులకు ప్రశ్నల వర్షం కురిపించారు. గొడౌన్‌లో 15536మంది లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణానికి చెందిన మెటీరియల్ 8కోట్ల 25లక్షలు విలువ ఉంటుందని అధికారులు సమాధానం చెప్పగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్లి విచారణ చేయిస్తామన్నారు. బాధ్యులు ఎంతటి వారైన సరే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అసలు దీని వెనుక ఎవరి హస్తం ఉందో నిగ్గు తేలుస్తామన్నారు. హౌసింగ్ సిబ్బంది మేటిరియల్‌ను చోరి చేస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. దీని వెనుక వైసీపీ నాయకుల హస్తం ఉందా అని అనుమానం వ్యక్తం చేశారు.

యువకుడిపై పోక్సో కేసు

కైకలూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మైనర్ యువతికి ఫోన్ చేసి పెళ్ళి చేసుకోవాలని లేకుంటే అంతు చూస్తా అని బెదిరించిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు కైకలూరు రూరల్ ఎస్సై వి.రాంబాబు తెలిపారు. మండలంలోని ఒక గ్రామానికి చెందిన 17ఏళ్ళ మైనర్ యువతి ఇంటర్ పూర్తిచేసి ఇంటి వద్దనే ఉంటుంది. చదువుకునే రోజుల్లో కలిదిండి మండలం తాడినాడ శివారు విభారావపురం గ్రామానికి చెందిన పామర్తి భార్గవ్‌తో పరిచయం ఏర్పడింది. ఈ పరిచయాన్ని అడ్డుపెట్టుకుని గతంలో యువతి తల్లిదండ్రులు లేని సమయంలో ఇంటికి వచ్చి లైంగికంగా వేధించి బలవంతం చేసేందుకు ప్రయత్నం చేశాడు. యువతి కేకలు వేయడంతో అక్కడి నుంచి పారిపోయాడు. అల్లరి అయితే పరువు పోతుందని భయంతో తల్లిదండ్రులు ఎవరికి చెప్పలేదు. దీన్ని అలు సుగా తీసుకుని గత నాలుగు రోజులుగా భార్గవ్ ఆ యువతికి ఫోన్ చేసి పెళ్లి చేసుకోవాలని బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో ఆ యువతి కైకలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్సై భార్గవ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఏపీ గిరిజన సమాఖ్య మండల కమిటీ ఎన్నిక

బుట్టాయగూడెం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఏపీ గిరిజన సమాఖ్య(ఏపీజీఎస్) మండల నూతన సమితిని ఎన్నుకున్నట్టు సీపీఐ మండల సమితి చోడెం దుర్గ తెలిపారు. అధ్యక్ష, కార్యదర్శులు చోడెం వెంకటేశ్వరరావు, కురసం రవీంద్ర మరో 11 మందితో నూతన సమితిని ఎంపిక చేశామన్నారు. గిరిజన సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని నూతన కమిటీ తెలియజేసింది. గిరిజనులపై జరుగుతున్న అన్యాయాలపై పోరాటాలకు సిద్ధంగా ఉన్నామన్నారు.

నేడు ఇరిగేషన్ సలహా మండలి సమావేశం

ఏలూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లా ఇరిగేషన్ సలహామండలి సమావేశం ఈ నెల 28న సాయంత్రం 4 గంటలకు కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్టు జిల్లా జలవనరుల శాఖ ఎస్ఈ సీహెచ్ దేవప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ కె వెట్రిసెల్వి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు,సాగునీటి సంఘాల ప్రతినిధులు హాజరవుతారని ఆయన తెలిపారు.

పాఠశాలల్లో వసతులు లేకపోతే గుర్తింపు రద్దు: డీఈవో


అన్నం వడ్డిస్తున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

టి.నరసాపురం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పాఠశాలలో పూర్తిస్థాయి వసతులు లేకపోతే గుర్తింపును రద్దు చేస్తామని జిల్లా విద్యాశాఖాధికారిణి ఎం. వెంకటలక్ష్మమ్మ హెచ్చరించారు. శ్రీసాయిసూర్య పబ్లిక్ స్కూల్‌ను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులు, మరుగుదొడ్లు, గ్రంథాలయాన్ని తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల విద్యార్హతతో పాటు పాఠశాల రికార్డులు పరిశీలించారు. పాఠశాలలో పూర్తిస్థాయిలో వసతులు లేవని వారం రోజుల్లో సరి చేసుకోకపోతే గుర్తింపు రద్దు చేస్తానని హెచ్చరించారు. అనంతరం జడ్పీ ఉన్నత పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. టెన్త్‌లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించడానికి ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగాలన్నారు. కనీసం 20 మంది విద్యార్థులు 500పైగా మార్కులు సాధించేలా చర్యలు చేపట్టాలన్నారు. మండల విద్యాశాఖాధికారులు టి.రామ్మూర్తి, ఎస్.కళ్యాణి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్టీసీ యాజమాన్యం తీరుపై ఏఐటీయూసీ నిరసన

ఏలూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ పెట్రోల్ బంకులో జరిగిన కుంభకోణంలో అవినీతిపరులను వెనకేసుకొస్తున్న యాజమాన్య వైఖరిని ప్రజాస్వామ్యవాదులంతా ఖండించాలని ఏఐటీయూసీ ఏలూరు జిల్లా గౌరవాధ్యక్షులు కె.కృష్ణమాచార్యులు ప్రకటించారు. ఆర్టీసీ వైఖరిని నిరసిస్తూ డిపో కార్యాలయం వద్ద జేఏసీ ఆధ్వర్యంలో జరుగుతున్న నాలుగో రోజు దీక్షా శిబిరాన్ని ఆయన గురువారం సందర్శించి మద్దతు ప్రకటించారు. పెట్రోల్ బంకులో జరిగిన 83లక్షలు అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి దోషులను శిక్షించాలన్నారు. దీనిపై ఇప్పటికే కలెక్టర్ వెట్రిసెల్వి విచారణకు ఆదేశించారని తెలిపారు. ఈ దీక్షలో డి.రాములు, కె.ప్రదీప్, ఎ మీనా, పి ప్రభావతి, జీవీ శాస్త్రులు, పీఎస్ బాబు, జీ ఈశ్వరరావు, బీఎస్ కళ, బీఎస్ నారాయణలు పాల్గొన్నారు.

కలప కటింగ్‌కు అనుమతివ్వాలని డీఎఫ్‌వోకు వినతి

జంగారెడ్డిగూడెం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఆరేళ్లుగా రెండు దఫాలు వన సంరక్షణ సమితికి అటవీశాఖ అధికారులు ఇవ్వాల్సిన అనుమతులివ్వకపోవడంతో గిరిజనులు పెంచుకున్న కలప దొంగల పాలవుతుందని బుట్టాయగూడెం మండలం పైదావారిగూడెం వన సంరక్షణ సమితి గొడ్డ రెడ్డమ్మ, పైదా రామలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం అటవీరేంజ్ అధికారి కార్యాలయం వద్దకు పైదావారిగూడెం వన సంరక్షణ సమితి సభ్యులు చేరుకున్నారు. ఈ సందర్భంగా అక్కడకు వచ్చిన జిల్లా అటవీ శాఖాధికారి సంజీవరెడ్డికి తమ గోడును వెళ్లబోసుకున్నారు. సమస్యను విన్నవించిన వారిలో కమిటీ సభ్యులు పైదా రాము, వెంకాయమ్మ, సింగ రాజు, వసంతరావు, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

పెదవేగి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తాళ్లగోకవరంలో నిర్మించిన అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ గురువారం ఉదయం అత్యంత వైభవంగా జరిగింది. గ్రామానికి చెందిన ఆలూరి సత్యనారాయణ, మాణిక్యాంబ దంపతుల ఆర్థిక సాయంతో నిర్మించిన ఆలయంలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ చేతుల మీదుగా విగ్రహ ప్రతిష్ఠ చేశారు. సర్పంచ్ నెక్కలపూడి సురేష్ బాబు, ఎంపీటీసీ సభ్యురాలు నెక్కలపూడి రాజారత్నం, నెక్కలపూడి రామచంద్రరావు, ఈడ్పుగంటి అనిల్, బొప్పన సుధాకర్, ఆలూరి హరికృష్ణ, వెలివెల నాగరాజు పాల్గొన్నారు.



యూటీఎఫ్ లింగపాలెం మండల కమిటీ ఎన్నిక

లింగపాలెం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై యూటీఎఫ్ నిరంతరం పోరాటం చేస్తుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. లింగపాలెం ఎన్నికల పరిశీలకులుగా హాజరైన యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ముస్తాఫా అలీ, జిల్లా కార్యదర్శి రవికుమార్, బంటు మోహన్ రావుల ఆధ్వర్యంలో లింగపాలెం మండల నూతన కమిటీ ఎన్నిక జరిగింది. గౌరవాధ్యక్షుడిగా ఎస్.రమేశ్, అధ్యక్షుడిగా సిహెచ్ సాల్మన్ రాజు, ప్రధాన కార్యదర్శిగా ఎస్.జయసింహా, కోశాధికారిగా ఎస్.కె.రెహ్మతుల్లా, సహాధ్యక్షుడిగా పి.వేణు, జీఎంఎస్ పద్మజ, మహిళా కార్యదర్శిగా ఎస్.కె.సాజిదాబేగం, మండల కార్యదర్శులుగా జి.మనోజ్, పి.రాఘవులు, ఎం.నరేశ్, సి.హెచ్.రాంబాబు, జి.వెంకట రమణ, ఎండీ ఉస్మాన్ పాషా,పవన్‌కుమార్, ప్రమాలా, జిల్లా కౌన్సిలర్లుగా సి.హెచ్.సాల్మన్‌రాజు, ఎస్.జయసింహా, టీవీ చలపతిరావు, ఎ.వి.బోస్ ఎన్నికయ్యారు. సీనియర్ యూటీఎఫ్ నాయకులు జి.ఎ.కె.మోహన్‌రాయ్, రాష్ట్ర యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యలు, భవిష్యత్ కార్యాచరణపై మాట్లాడారు. అనంతరం రాష్ట్ర ఉత్తమ అవార్డు గ్రహీత ఎండీ ఉస్మాన్‌బాషా, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయఅవార్డు గ్రహీత పి.సత్యనారాయణ, ఇతర ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అమరవరం హాస్టల్‌ను త్వరలోనే పునఃప్రారంభిస్తాం



కుక్కునూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని అమరవరం సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని పునఃప్రారంభించేలా చర్యలు తీసుకుంటానని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు హామీ ఇచ్చారు. అమరవరం హాస్టల్ పూర్వ విద్యార్థులు, జనసేన నాయకులు మేకా ఈశ్వరయ్య నేతృత్వంలో గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి అమరవరం పరిసర గ్రామాల్లోని దళిత, గిరిజన పిల్లల కోసం వసతిగృహ ప్రాధాన్యత వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ వసతి గృహానికి సంబంధించి సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ పేషీలో ఈ ఫైలు ఉందని అక్కడ అధికారులతో మాట్లాడి వెంటనే పునఃప్రారంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడి వసతిగృహం ఏర్పాటుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో టంబళ్ల కన్నయ్య, ఆర్.వెంకటి, శనగా వెంకటేశ్వర్లు, మడిపల్లి వెంకటేశ్వరరావు, బుయ్యన నాగేశ్వరరావులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ దృష్టికి భూ సమస్యలు



లింగపాలెం: రాష్ట్ర గ్రీనింగ్ అండ్‌బ్యూటిఫికేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పల్లి శ్రీను నూజివీడు సబ్ కలెక్టర్ బి.వినూత్నను మర్యాద పూర్వకంగా కలిశారు. నూజివీడు సబ్ డివిజన్ పరిధిలోని భూ సమస్యలను ఆమెకు వివరించారు.

మూడు రోజులే గడువు!

(3వ పేజీ తరువాయి)

తీస్తారు. దరఖాస్తుదారు ఫొటోను యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. ముఖ గుర్తింపును యాప్ క్యాప్చర్ చేసిన వెంటనే ఆధార్ కార్డు ఆటోమేటిక్‌గా డిస్‌ప్లే అవుతుంది. జాబ్ కార్డు వివరాలు, బ్యాంకు ఖాతా వివరాలు తీసుకుంటారు. దరఖాస్తుదారుల్లో మొదట అత్యంత పేదలకే ఇల్లు మంజూరయ్యేలా యాప్‌ను కేంద్ర ప్రభుత్వం డిజైన్ చేసింది. యాప్‌లో నమోదైన వివరాల ఆధారంగా అర్హుల జాబితా సిద్ధం కానుంది. ఒంటరి మహిళలు, వితంతువులకు ప్రాధాన్యం ఇస్తారు. రాష్ట్ర ప్రభుత్వం యాప్ ద్వారా నమోదు చేసిన వారి వివరాలను కేంద్రానికి నివేదించనున్నారు. అక్కడి నుంచి వచ్చే తుది జాబితాలోని వారికి ఇల్లు మంజూరు చేస్తారు.

జిల్లా టీడీపీ అధ్యక్ష పదవిపై వీడని ఉత్కంఠ

(3వ పేజీ తరువాయి)

కట్టుబెట్టాలంటూ జిల్లా వ్యాప్తంగా క్లస్టర్, నియోజకవర్గ ఇన్‌చార్జుల నుంచి పార్టీ అధిష్ఠానం ఫోన్‌కాల్స్ అభిప్రాయ సేకరణ చేపట్టింది. ఇందులో ఎవరి వైపు ఎంత మంది నాయకులు, ఇన్‌చార్జులు మొగ్గుచూపారో అన్న ఉత్కంఠ రేగుతోంది. ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో సంస్థాగతంగా బూత్, గ్రామ,మండల, పట్టణ కమిటీల ప్రమాణ స్వీకారాల ఘట్టం ఘనంగా నిర్వహించారు. ఇదిలా ఉండగా ఐవీఆర్ఎస్, ఫోన్‌కాల్స్ అభిప్రాయ సేకరణలో తమను పట్టించుకోకపోవడంతో ఆశావహులైన తెలుగు తమ్ముళ్లలో నిరాశ అలముకుంది. సీఎం చంద్రబాబు నాయుడు డిసెంబరు 1న ఉంగుటూరు పర్యటనకు రానున్నారు. దీంతో ఈ నాలుగు రోజుల్లో ప్రకటన ఉండకపోవచ్చుని చెబుతున్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత


విద్యార్థులతో జడ్పీ చైర్మన్ పద్మశ్రీ

పెదపాడు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి):ఉన్నత లక్ష్య సాధనే జీవిత ఆశయం కావాలని, అందుకు పునాది విద్యార్థి దశ నుంచే పడాలని జడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ తెలిపారు. జడ్పీ నిధులతో రూపొందించిన విజయకేతనం స్టడీ మెటీరియల్‌ను పెదపాడు మండలం సత్యవోలు హైస్కూల్లో టెన్త్ విద్యార్థులకు జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ గురువారం అందజేశారు. అనంతరం పద్మశ్రీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కూటమి ప్రభుత్వం తగిన కృషి చేస్తోందన్నారు. స్టడిమెటీరియల్‌ను సమర్థవంతంగా వినియోగించుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● ఏలూరు రూరల్: విద్యార్థులు చిన్నతనం నుంచే పోటీతత్వాన్ని అలవాటు చేసుకోవాలని జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. గురువారం శనివారపుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు 'విజయకేతనం' స్టడీ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

● కామవరపుకోట: తడికలపూడిలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు విజయకేతనం పుస్తకాలు అందచేసినట్టు హెచ్ఎం ఎ.సర్వేశ్వరరావు తెలిపారు. అనంతరం పుస్తకం ప్లే ల్యాబ్‌ను, కిచెన్ గార్డెన్‌ను ప్రారంభించారు.జడ్పీటీసీ కడిమి రమేశ్, సర్పంచ్ కొత్తపల్లి రజనీ శ్రీనివాస్, సొసైటీ చైర్మన్ తూతా బాలాజీ కుమార్, మాజీ సర్పంచ్ మేరుగు సుందరరావు, నందిగం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● చింతలపూడి: స్థానిక బాలికోన్నత పాఠశాలలో టెన్త్ విద్యార్థుల కోసం రూపొందించిన విజయకేతనం పుస్తకాన్ని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా చదువుకుని ముందుకు రాణించాలన్నారు. అనంతరం మధ్యాహ్న పథకాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే వెంట మాజీ ఏఎంసీ చైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి, జనసేన అధ్యక్షులు చీదరాల మధుబాబు, ఎంఈవోలు రామారావు, కిరణ్‌బాబు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి


ఇళ్లకు వెళ్లి ప్రచార పత్రాలందజేస్తున్న బొరగం

ఏలూరు టూటౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): వైసీపీ రైతులను దగా చేసిందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ కార్యక్రమం పోణంగిలో జరిగింది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు రైతులకు ఇచ్చిన లేఖలను ఎమ్మెల్యే చంటి అందజేశారు. ఇడా చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఏఎంసీ చైర్మన్ పార్థసారథి, కార్పొరేటర్ డి.అనూష, డివిజన్ ఇన్‌చార్జి సాంబశివరావు, రామకృష్ణ, జీ.బోస్, దావూద్, తదితరులు పాల్గొన్నారు.

రైతుల వద్దకు వెళ్లి లేఖలు అందజేసిన నాయకులు

● బుట్టాయగూడెం: రైతులు అధైర్యపడొద్దని కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు అన్నారు. అన్నదాత సుఖీభవలో భాగంగా గురువారం మండలంలోని కండ్రికగూడెంలో రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నదాతకు లాభసాటి కోసం ప్రభుత్వం చేపట్టిన చర్యలతో కూడిన కరపత్రాలను రైతులకు అందజేస్తూ అవగాహన కల్పించారు. నాయకులు మొగపర్తి సోంబాబు, సున్నం నాగేశ్వరరావు, దెయ్యాల కృష్ణమోహన్, నల్లా రాంబాబు, సున్నం నాగేశ్వరరావు, కోర్స వెంకటేశ్వరరావు, ఏవో ప్రియాంక పాల్గొన్నారు.

నేడు బూసరాజుపల్లిలో గ్రీవెన్స్

బూసరాజుపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్టు ట్రైకార్ చైర్మన్ తెలిపారు. సమస్యలపై లిఖిత పూర్వకంగా అందజేయాలని వాటిని ముఖ్యమంత్రి, ఐటీ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు.


ప్రచార పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే చింతమనేని


● ఏలూరు రూరల్:రైతన్నలకు పెట్టుబడి సాయం కింద అన్నదాత సుఖీభవ పథకం ద్వారా పెట్టుబడి సాయం అందించడమే కాకుండా,పండించిన ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసి గంటల వ్యవధిలోనే ఎలాంటి మధ్యవర్తులు దళారులు లేకుండా రైతు ఖాతాల్లో ధాన్యం సొమ్మును జమ చేస్తూ కూటమి ప్రభుత్వం రైతన్నలకు అండగా నిలుస్తుందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. రైతు కోసం కార్యక్రమంలో భాగంగా ఏలూరు రూరల్ మండలం చాటపర్రు,మాదేపల్లి, జాలిపూడి గ్రామాల్లో గురువారం సాయంత్రం ఎమ్మెల్యే పర్యటించారు. చంద్రబాబు నాయుడు నుంచి వచ్చిన అభినందన లేఖలను స్వయంగా రైతులకు అందించారు.

క్రీస్తు బోధనలు అనుసరించాలి

పెదవేగి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): క్రీస్తు బోధనలు సమాజాన్ని మంచి మార్గంలో నిలుపుతాయని, ప్రతి ఒక్కరూ అనుసరించాలని బెయెర్షెబా ప్రార్థనా మందిరం వ్యవస్థాపకుడు బ్రదర్ కె.సాల్మన్ రాజు అన్నారు.పెదవేగి మండలం జగన్నాథపురంలో బెయెర్షెబా ప్రార్థనామందిరం 25వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా బ్రదర్ సాల్మన్ రాజు మాట్లాడుతూ ఆర్తుల రక్షణకు క్రీస్తు తన ప్రాణాలను పణంగా పెట్టాడన్నారు.క్రీస్తు బోధనలు ఎప్పటికీ అనుసరణీయమని, ప్రతిఒక్కరూ ఆచరించాలని ఆయన తెలిపారు. బ్రదర్ కె.గాంధీ, కమ్మ నానాజీ, చిలకలపూడి రమేష్, విశ్వాసులు పాల్గొన్నారు.

సీపీఎం నేత ఉద్దరాజు రామం వర్ధంతి

ఏలూరు కార్పొరేషన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఉద్దరాజురామం స్వాతంత్ర్య సమరయోధుడని, రైతు ఉద్యమ నిర్మాత అని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతగా సీపీఎం వ్యవస్థాపకుడిగా కొనసాగారని పార్టీ నాయకులు ఎం.ఇస్సాకు పేర్కొన్నారు. పవరుపేటలోని సీపీఎం కార్యాలయంలో గురువారం ఉద్దరాజు రామం 30వ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పి.రామకృష్ణ, ఎ.శ్యామలరాణి, జె.గోపి, జి.కోటేశ్వరరావు, మీసాల సత్యం, సి.హెచ్.అమర్‌కుమార్, ఎస్.సత్యనారాయణ పాల్గొన్నారు.


వరి పొలంలోకి చేరిన చెరువు నీళ్లు

పంట పొలాలు కాపాడండి

ఏలూరు రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): చేపల చెరువుల వల్ల పంట పొలాలు నాశనమవుతున్నాయని పెదపాడు మండలం సత్యవోలుకు చెందిన సింగవరపు అప్పారావు గురువారం ఆరోపించారు. ఎటువంటి అనుమతులు లేకుండా చెరువులు తవ్వి, చేపలను పెంచుతున్నారన్నారు. వ్యర్థాలు బయటకు వదిలేయడంతో సమీపంలో పొలాల్లోకి చేరి పంటలు నాశనం అవుతున్నాయన్నారు. సమస్య పరిష్కారానికి రెండేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్న సమస్య పరిష్కారం కావడం లేదంటూ వాపోయారు. పరిష్కారం చూపాలంటూ కలెక్టర్ కలిసి విజ్ఞప్తి చేశారు. పెదపాడు మండలంలో కొందరు ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా పంట భూముల్ని చెరువులుగా మార్చడం వల్లే ఈ సమస్య వచ్చిందన్నారు.

ఆక్రమించిన భూమిని ఇప్పించండి

ఏలూరు రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కామవరపుకోట మండలం తడికలపూడికి చెందిన దళిత సామాజిక వర్గానికి చెందిన ఒక మహిళకు చెందిన ఐదెకరాల 14 సెంట్లు వ్యవసాయ భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని దళిత బహుజనుల నాయకుల ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ తడికలపూడిక చెందిన కొనుదల విజయకు చెందిన వ్యవసాయ భూమిని ఆక్రమించారని తిరిగి ఇప్పించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడను కలిసి విన్నవించారు.బాధితురాలు కొణుదుల విజయ, దళిత నాయకులు నేతలు రమేష్ బాబు, కాపుదాసు రవి, ఎరికిపాటి విజయ్, కంచర్ల విజయ శేఖర్, కర్రే అంబేద్కర్, గొల్ల కిరణ్ కుమార్, కర్ణకోటి దిలీప్ కుమార్, పాము రవీంద్ర పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణ సక్రమంగా ఉండాలి

పెదవేగి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య నిర్వహణ సక్రమంగా ఉండాలని, అప్పుడే ప్రజలు ఆరోగ్యంతో ఉంటారని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు.పెదవేగి మండలం కూచింపూడిలో పారిశుధ్య నిర్వహణ తీరును పరిశీలించిన ఆయన చెత్త బహిరంగంగా రోడ్లపై వేయడాన్ని ఆయన ఆక్షేపించారు. చెత్తను రోడ్లపై బహిరంగంగా వేస్తే అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. ఈడ్పుగంటి అనిల్, బొప్పన సుధాకర్ పాల్గొన్నారు.


వినతి పత్రం అందజేస్తున్న సంఘ నాయకులు

మంత్రికి జై గౌడ సేన వినతి

దెందులూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి):ఏపీలో గౌడ సామాజిక వర్గ సమస్యలను పరిష్కరిస్తూ వారి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఏపీ రెవెన్యూ, స్టాంప్స్ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు జై గౌడ సేన సంఘం జాతీయ అధ్యక్షుడు మోర్ల ఏడుకొండలు విజ్ఞప్తి చేశారు. గురువారం అమరావతిలో ఏపీ జై గౌడ సేన సంఘం రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు మట్టా వెంటేష్ గౌడ్, సంఘం నాయకులతో కలిసి మంత్రికి విన్నవించారు. గౌడ కార్పొరేషన్‌కు వెయ్యి కోట్లు కేటాయించాలని అమరావతిలో గౌడ సంఘానికి ఐదెకరాల భూమి కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో జైగౌడ సేన రాష్ట్ర సంఘం నాయకులు ఉన్నారు.

గుణపర్రు రోడ్డుకు శంకుస్థాపన

నిడమర్రు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల సుస్థిర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పేర్కొన్నారు. గురువారం మందలపర్రు నుంచి గుణపర్రు వెళ్లే రోడ్డులో నాబార్డు నిధులు రూ.కోటి 50లక్షల అంచనా నిర్మించనున్నారు. ఈ పనులను ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. మందలపర్రు సర్పంచ్ దెందుకూరి సూర్యకాంతం,కూనపరాజు వెంకట సత్యనారాయణరాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

జీవన ప్రమాణాలు పెంపొందించుకోవాలి

కామవరపుకోట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తడికలపూడి మహిళా ప్రాంగణంలో కుట్టు శిక్షణ పొందుతున్న యువతకు మాజీ మంత్రి పీతల సుజాత, జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావులు గురువారం సలహాలు, సూచనలిచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. శిక్షణ పొందుతున్న తీరును పరిశీలించారు. శిక్షణ పొందుతున్న వారికి తగు సలహాలు, సూచనలిచ్చారు. ప్రాంగణ నిర్వాహకులు పాల్గొన్నారు.

సత్యసాయి జయంతి వేడుకలు

కామవరపుకోట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కామవరపుకోట మండలం పోలాసిగూడెంలో భగవాన్ సత్యసాయి శత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సత్యసాయి చిత్రపటానికి ప్రత్యేక హారతులిచ్చారు. సంకీర్తనలు ఆలపించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని బీజేపీ నాయకులు చెలికాని భాస్కరరావును దుశ్శాలువాలతో సత్కరించారు.కార్యక్రమంలో గ్రామ నాయకులు కోడూరి సాయి గిరిధర్, దుద్దుపూడి శ్రీను,గూడపాటి శ్రీహరి, పుసులూరి రామచంద్ర రావు, బాల వెంకట్రావు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోషన్

అర్బన్ హెల్త్ సెంటర్‌కు శంకుస్థాపన

చింతలపూడి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): చింతలపూడి నగర పంచాయతీలోని భట్టువారిగూడెం రోడ్డులో కోటి 90 లక్షలతో నిర్మించే అర్బన్ హెల్త్ సెంటర్ నూతన భవన నిర్మాణానికి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ గురువారం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ నగర పంచాయతీ అభివృద్ధికి ఒక్కొక్కటి చేసుకుంటూ వస్తున్నామని, సెంట్రల్ లైటింగ్, సులభ కాంప్లెక్స్, రోడ్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. వంద పడకల ఆసుపత్రి పనులు త్వరలో పూర్తి కానున్నాయన్నారు. చింతలపూడి నగర పంచాయతీకి త్వరలో మూడు కోట్లు నిధులు రానున్నాయని, వాటితో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

ద్వారకాతిరుమల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): టెన్త్ విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు గ్రామానికి, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని ద్వారకాతిరుమల సొసైటీ చైర్మన్ పోలిన శ్రీనివాసరావు కోరారు. మండలంలోని తిమ్మాపురం జడ్పీ పాఠశాలలో చదువుతున్న టెన్త్ విద్యార్థులకు జడ్పీ ద్వారా విజయకేతనం బుక్స్‌ను జడ్పీటీసీ సి.హెచ్. శామూల్ చేతుల మీదుగా అందచేశారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 33వేల మంది విద్యార్థులకు ఈ పుస్తకాలను అందజేయనున్నట్లు చెప్పారు. ఎంపీటీసీ కొయ్యలమూడి సరిత, నేత ఘంటా శ్రీనివాసరావు, ఏపూరి కిషోర్ పాల్గొన్నారు.

వినుకొండ అంకమ్మకు ఘన స్వాగతం

ఏలూరు కార్పొరేషన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక పడమరవీధిలో జాతర క్రతువులో భాగంగా గురువారం వినుకొండ అంకమ్మను మేళతాళాలు,బాజాభజంత్రీలతో స్థానిక కుండీ సెంటర్ నుంచి ప్రదర్శనగా మేడల వద్దకు తీసుకెళ్లి మేడల్లో ప్రవేశపెట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. వినుకొండ అంకమ్మ మూడు రాత్రులు, మూడు పగళ్ళు నగర సంచారం పూర్తి చేసుకున్న నేపథ్యంలో గురువారం మేడల్లో ప్రవేశించారు. దీంతో అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, మీనాకుమారి దంపతులు, ఆర్టీసీ విజయవాడ జోన్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు, మాజీ ఎమ్మెల్యే బడేటి బుజ్జి సతీమణి బడేటి రేణుక, ఏఎంసి చైర్మన్ మామిళ్ళపల్లి పార్థసారథి, ఈడా మాజీ చైర్మన్ మధ్యాహ్నపు ఈశ్వరీ బలరాం, టీడీపీ నగర అధ్యక్షులు చోడే వెంకటరత్నం, పెద్దిబోయిన శివప్రసాద్, జాతర కమిటీ అధ్యక్షులు చోడే బాలు, ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ యాదవ్‌లతో పాటు కూటమి నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కోలాహలంగా జరిగిన కార్యక్రమంలో అమ్మవార్ల నామస్మరణతో మార్మోగింది.

దక్షిణపు వీధిలో జాతర..

ఏలూరు సర్వజన సమ్మేళన దక్షిణపువీధి జాతర మహోత్సవాల్లో భాగంగా గురువారం మార్గశిర శుద్ధ సప్తమి నేపథ్యంలో అమ్మవార్ల ఘట ఆవాహన నిర్వహించి అమ్మవారి భూమి మీద పాదం మోపే కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో జాతర కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జగన్మోహనరావు ప్రథమ వర్ధంతి

ఏలూరు రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): దివంగత హేలాపురి లయన్స్ నాయకులు, ప్రముఖ వైద్యులు యార్లగడ్డ జగన్మోహనరావు ప్రథమ వర్ధంతిని హేలాపురి లయన్స్ క్లబ్‌లో గురువారం నిర్వహించారు. పర్వతనేని సుభాష్‌బాబు, డైరెక్టర్ చిగురుపాటి వరప్రసాద్, మల్టిపుల్ నాయకులు మూలర్పూరి ఉపేంద్ర, జిఎస్‌వివిఎస్ పాపారావునాయుడు, డా.దశిక సుబ్బారావు, సూర్యనారాయణరాజు, కాకరాల వేణుబాబు, డా.పి విజయ భాస్కర్‌రెడ్డి, కుటుంబ సభ్యులు, డాక్టర్ స్వర్ణలత, సౌజన్య పాల్గొన్నారు. క్లబ్ అధ్యక్షులు బీవివి సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. జిల్లా నాయకులు లేళ్ల వెంకటేశ్వరరావు, నాట్యాచార్య దువ్వి హేమసుందర్ నిర్వహించారు.

తలసీమియా చిన్నారులకు రక్త పరీక్షలు

ఏలూరు క్రైం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్‌క్రాస్ తలసీమియా సెంటర్‌లో తలసేమియా బాధిత చిన్నారులకు, వారి కుటుంబ సభ్యులకు 30 మందికి హెచ్‌పిఎల్‌సి రక్త పరీక్షలు ఉచితంగా నిర్వహించామని జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ ఎంబీఎస్వీ ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ తలసేమియా, సికిల్‌సెల్ అనీమియా వంటి రక్త సంబంధిత వ్యాధుల ఖచ్చితమైన నిర్ధారణకు హెచ్‌పీసీఎల్ పరీక్ష అత్యంత కీలకమైందన్నారు. తలసీమియా వ్యాధిని భవిష్యత్ తరాలకు సంక్రమించకుండా నివారించవచ్చన్నారు. అనంతరం ఆరుగురు తలసీమియా చిన్నారులకు రక్తమార్పిడి చికిత్స నిర్వహించారు. రెడ్‌క్రాస్ కార్యదర్శి బి.బెన్నీ, డాక్టర్ సిర్ర ఆల్బర్ట్, హెడ్‌నర్స్ ఎం.శాంత కుమారి, ల్యాబ్ టెక్నీషియన్లు ఎన్.విజయ, పి.సునీల్ పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

లింగపాలెం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సమా చార హక్కు చట్టం గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని లింగపాలెం మండల ఎంఈవో కె.వి. దుర్గారావు తెలిపారు. లింగ పాలెం మండలం సింగగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించారు. ప్రతి ఉపాధ్యాయుడు పాఠశాలల్లో విద్యార్థులకు కూడా సమాచారహక్కుచట్టంపై అవగాహన కల్పించాలన్నారు. ఈ చట్టం ప్రకారం ఎటువంటి సమాచారం అడిగినా 30 రోజుల్లోపు అందించాలన్నారు. ఈ కార్యక్రమం లో ఎంఈఓ-2 జే రవీంద్ర, అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ రిపేరు శిక్షణ

పెదపాడు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): వట్లూరులోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ బ్యాంక్ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఉచితంగా సెల్ ఫోన్, సీసీటీవీ రిపేరు, సర్వీసింగ్ పై స్త్రీ, పురుషులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్టు సంస్థ కార్యాలయం తెలిపింది. 18-45 సంవత్సరాల మధ్య వయస్సు గలవారు అర్హులన్నారు. శిక్షణ కాలంలో శిక్షణతో పాటుగా ఉచితంగా భోజనం, వసతి, టూల్‌కిట్ ఇవ్వనున్నట్టు తెలిపారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్‌తో పాటుగా అర్హులైన అభ్యర్థులకు ముద్ర రుణం మంజూరుకు సిఫార్స్ చేయనున్నట్టు తెలిపారు. వివరాలకు 99485 65256, 95027 23561, 90140 40780 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

కళాశాల విద్యార్థుల ర్యాలీ

ఏలూరుఅర్బన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లాలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు శిక్షణ తరగతులు జరిగాయి. ఇంటర్ బోర్డు ఆర్జేడీ శేఖర్‌బాబు, ఆర్ఐవో యోహాన్, ప్రిన్సిపాల్ రాజ్‌కృష్ణ పాల్గొన్నారు.

పోలియో నిర్మూలనపై అవగాహన

ఏలూరుఅర్బన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పోలియోను అంతమొందిద్దాం అనే నినాదంతో ఏలూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక కస్తూరిబా మున్సిపల్ బాలికోన్నత పాఠశాల, కృష్ణదేవరాయ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. క్లబ్ జిల్లా చైర్మన్ డాక్టర్ దామోదర్‌రెడ్డి, ప్రతినిధులు స్వామి, కొండలరావు, జగదీష్, రోహిత్, హేమంత్, నాగమణి, జగదీష్ పాల్గొన్నారు.

హైస్కూల్‌కు గ్యాస్ పొయ్యి

పెదపాడు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): అప్పనవీడు జడ్పీ హైస్కూల్‌కు విజయలక్ష్మి జ్ఞాపకార్థం అల్లుడు కడిమి సాంబశివరావు గ్యాస్ పొయ్యి అందజేశారని హైస్కూల్ ఇంచార్జి హెచ్.ఎం. ఎస్.పరమేశ్వరి తెలిపారు. కొంతకాలంగా పాఠశాలకు గ్యాస్‌పొయ్యి కొరత ఉండటంతో దాత అందజేసిన గ్యాస్ పొయ్యి పాఠశాలకు ఎంతో ఉపయోగకరమన్నారు. అభయాంజనేయ స్వామి దేవాలయ చైర్మన్ వేమూరి శ్రీనివాసరావు, స్కూల్ కమిటీ చైర్మన్ ఎం.లక్ష్మీదుర్గ, వడ్డి వాసవి, గరికిపాటి చంటి పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నిర్మూలించాలి

భీమడోలు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి):బాల్య వివాహాలు లేని సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో పద్మావతి దేవి సూచించారు. బాల్య వివాహాల ముక్త భారత్‌లో భాగంగా భీమడోలు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహ ముక్త భారత్ ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎంపీడీవో పద్మావతిదేవి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బాల్య వివాహాల కారణంగా జరిగే అనర్థాలను గ్రామాల్లో పాఠశాలల్లో, కళాశాలల్లో ప్రచారం నిర్వహించాలని ఐసీడీస్ పీవో రాజశేఖర్ సూచిం చారు. సూపర్‌వైజర్లు నూర్జహాన్, రూప, సూపరింటెండెంట్ శర్మ, క్రాఫ్ జిల్లా కో-ఆర్డినేటర్ రవి పాల్గొన్నారు.

ఏలూరు జిల్లా పేరు మార్చాలి

జంగారెడ్డిగూడెం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లాను ఉత్తర గోదావరి జిల్లాగా పేరు మార్చాలని కోరుతూ ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శుక్రవారం ఉదయం పదిగంటలకు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, మేధావులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్టు మాజీ జడ్పీటీసీ ముప్పిడి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొని తమ అభిప్రాయాలు తెలియచేయాలన్నారు.

అంగవైకల్యం నిర్ధారణ పరీక్షలు

దెందులూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల అంగవైకల్యం నిర్ధారణ వైద్య శిబిరాన్ని దెందులూరు జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఏలూరు సమగ్ర శిక్ష ఏలూరు ఆధ్వర్యంలో జిల్లా కోఆర్డనేటర్ బి. భాస్కర్‌రాజు ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో 60 మంది దివ్యాంగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. దేశ స్థాయిలో ఉచితంగా ఉపకరణాలు అందించేలా వైద్యుల బృందం దివ్యాంగులకు పరీక్షలు నిర్వహించారు. భవిత ఉపాధ్యాయులు డి.హేమలత, శ్రీదేవి, డి.సుధీర్ కుమార్, దెందులూరు హైస్కూల్ హెచ్ఎం వడ్లపట్ల విజయ్ కుమార్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

లింగపాలెం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): లింగపాలెం మండలం ధర్మాజీగూడెంలో ఎస్ఐ కె.వెంకన్న ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనదారులకు రోడ్డుభద్రతా నిబంధనలపై అవగాహన కల్పించారు. ఎస్ఐ వెంకన్న మాట్లాడుతూ రోడ్డుభద్రతా నిబంధన ఉల్లంఘనలను గుర్తించేందుకు, అనుమానాస్పద డ్రైవర్లను గుర్తించేందుకు ఈ తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. నెంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు నడిపితే అటువంటి వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ తనిఖీలలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకోండి : మున్సిపల్ కమిషనర్

నూజివీడు, నవంబరు 27, (ఆంధ్రజ్యోతి) : నూజివీడు పట్టణ పరిధిలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద ఉన్న టిడ్కో గృహ సముదాయంలో 377 ఖాళీల భర్తీకి లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవచ్చని నూజివీడు పురపాలక కమిషనర్ కె.వీరయ్య తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ 300, 365, 430 చదరపు గజాల విభాగాలలో ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. డిసెంబరు పదో తేదీలోగా ఆయా సచివాయాలలో దరఖాస్తు చేసుకోవ్వని తెలిపారు.

'టీచ్ టూల్ తరగతి గది'పై టీచర్లకు శిక్షణ

చాట్రాయి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): చాట్రాయి మండల విద్యాశాఖ కార్యాలయంలో 'టీచ్ టూల్ తరగతి గది' అనే అంశంపై ఉపాధ్యాయులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు శిక్షణకు హాజరయ్యారు. కోర్సు కో-ఆర్డినేటర్‌గా ఎంఈవో-2 వీఎస్‌వీ బ్రహ్మచారి వ్యవహరించారు. రిసోర్స్‌పర్సన్స్ జి.సంజీవకుమార్, వి.వెంకటేశ్వరరావు, ఎంఈవో-1 ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.


కైకలూరులో పెట్రోలు బంకును ప్రారంభిస్తున్న అంజనీకుమార్‌యాదవ్

పెట్రోలు బంకులతో జైళ్లశాఖ బలోపేతం

▸▸ జైళ్లశాఖ డీజీపీ అంజనీకుమార్ యాదవ్

కైకలూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పెట్రోలు బంకుల నిర్వహణ వల్ల జైళ్లశాఖ ఆర్థికంగా బలోపేతం అవుతుందని, తద్వారా ఆదాయ వనరులను సమకూరుస్తున్నామని రాష్ట్ర జైళ్లశాఖ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్ అంజనీ కుమార్ యాదవ్ అన్నారు. గురువారం కైకలూరు సబ్‌జైల్ ప్రాంగణం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన హెచ్‌పీ పెట్రోలు బంకును ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 23 పెట్రోలు బంకులను జైళ్ల శాఖ ద్వారా ఏర్పాటు చేశామని వీటిని ఆదర్శంగా తీసుకుని ఇతర రాష్ట్రాల్లో పెట్రోలు బంకుల నిర్మాణాన్ని చేపట్టిందన్నారు. ఖైదీల్లో నైపుణ్యాభివృద్ధి పెరుగు తుందని సమాజసేవ కేంద్రాలుగా మార్చేందుకు దోహదపడుతుందన్నారు. జైళ్లలో ఖైదీల శిక్షాకాలంలో ఇలాంటి వాటిపై నైపుణ్యత సాధించి సమాజంలో తిరిగి కలిసిపోవడానికి మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమాలలో జైళ్లశాఖపై ప్రజల్లో సానుకూల అభిప్రాయం ఏర్పడుతుందని, పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యం ద్వారా సంస్కరణాత్మక సామాజిక సంక్షేమ కార్యక్రమాలు బలపడతాయన్నారు.

అనంతరం రూ.1.90 కోట్లతో నిర్మాణం చేసే కైకలూరు సబ్‌జైలును పరిశీలించారు. పనుల నిర్వహణలో కాంట్రాక్టరు టైల్స్ వేయకుండా ఫ్లోరింగ్ చేయడంపై అసహనాన్ని వ్యక్తం చేశారు. టెక్నాలజీ పెరుగుతున్న రోజుల్లో జైళ్ళల్లో కూడా మార్పులు తీసుకువచ్చామని ఫ్లోరింగ్ అంతా టైల్స్ నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. గుంటూరు రేంజ్ జైళ్లశాఖ డీజీపీ డాక్టర్ వరప్రసాద్, విజయవాడ సబ్‌జైల్ అధికారి ఎస్.శివశంకర్, ఏలూరుజిల్లా జైల్ సూపరింటెండెంట్ స్వామి, మచిలీపట్నం జిల్లా జైల్ సూపరింటెడెంట్ పిల్లా రమేష్, కృష్ణాజిల్లా సబ్‌జైల్ అధికారి ఉమామహేశ్వరరావు, కైకలూరు సబ్‌జైల్ సూపరింటెండెంట్ బొత్స అప్పారావు పాల్గొన్నారు.

భోగేశ్వరస్వామి ఆలయ ఈవోగా 'శింగనపల్లి'



కలిదిండి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కలిదిండి పాతాళ భోగేశ్వరస్వామి ఆలయ నూతన కార్యనిర్వహణ అధికారిగా శింగనపల్లి శ్రీనివాసరావును నియమిస్తూ దేవదాయ, ధర్మదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఈవోగా పనిచేస్తున్న వి.ఎస్.కె.శేఖర్‌ను పదోన్నతిపై విస్సకోట గ్రూపు దేవాలయాలకు బదిలీ చేశారు. ప్రస్తుతం శ్రీనివాసరావుకు రెగ్యులర్ చార్జిలో ఉన్న వడాలి జగన్నాథ స్వామి దేవాలయం గురజ దేవాలయాలను అదనపు చార్జిలో ఉంచారు.

'జ్యోతిరావుపూలే ఆశయాలు మహోన్నతమైనవి'

కైకలూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బాలికల విద్యాభివృద్ధికి జ్యోతిరావుపూలే చేసిన కృషి వల్లే నేటి ప్రపంచంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని బీసీ సంఘం నాయకులు గంగునేని వరప్రసాద్ అన్నారు. గురువారం జ్యోతిరావుపూలే 135వ వర్ధంతి సందర్భంగా కైకలూరులో వున్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పూలే సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కట్టా గోపి, బీసీ నాయకులు పూల రామచంద్రరావు, బూరుబోయిన శ్రీనివాస రావు, తుపాకుల సోమాచారి, బోయిన రామకృష్ణ, కట్టా నాగరాజుగౌడ్, బొల్లా శ్యామలరావు, జక్కుల విజయకుమార్, వేగిరెడ్డి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు భరోసాగా సీఎం సహాయనిధి

చాట్రాయి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్యానికి సీఎం సహాయనిధి భరోసాగా నిలుస్తుందని తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, టీడీపీ నాయకుడు నక్కా రాము అన్నారు. నూజివీడు ఎమ్మెల్యే, మంత్రి కొలుసు పార్థసారథి సిఫారసుతో సీఎం సహాయనిధి నుంచి చనుబండ గ్రామానికి చెందిన విస్సంపల్లి విల్సన్‌బాబుకు రూ.54 వేలు, మోరంపూడి అమలకు రూ.20 వేలు మంజూరు కాగా, గురువారం లబ్ధిదారులకు వారు చెక్కులు అందజేశారు.

ఏపీ ఎన్‌జీవో సభ్యత్వాల నమోదు

ముదినేపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ఎన్‌జీవో సభ్యత్వాల నమోదు కార్యక్రమాన్ని అసోసియేషన్ నాయకులు ముదినేపల్లి మండలంలో నిర్వహిస్తున్నారు. గురువారం ముదినేపల్లిలోని జిల్లా పరిషత్ హైస్కూలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఇతర శాఖల ఉద్యోగులకు అసోసియేషన్ మండవల్లి యూనిట్ అధ్యక్షుడు ఎంవీ సుబ్బారావు, ఉపాధ్యక్షుడు ఎం కొండలు సభ్యత్వ నమోదు పత్రాలను అందజేశారు. పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల షాపులో విజిలెన్స్ తనిఖీలు

చాట్రాయి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): చాట్రాయిలోని ఓ ప్రైవేటు ఎరువులు పురుగు మందుల షాపులో గురువారం సాయంత్రం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌ఐ కె.నాగరాజు, ఏవో మీరయ్య ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో మొక్కజొన్న విత్తనాల నిల్వలలో వ్యత్యాసం ఉండడంతో రూ.3.90 లక్షల విలువైన 6.86 క్వింటాళ్ల మొక్కజొన్న విత్తనాల అమ్మకాలను నిలుపుదల చేసి, నిత్యావసరాల చట్టం-1955 యాక్ట్ ప్రకారం 6ఏ కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ ఎస్‌ఐ తెలిపారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు కచ్చితంగా బిల్లులు తీసుకోవాలని విజిలెన్స్ ఎస్‌ఐ కోరారు. తనిఖీలలో చాట్రాయి ఏవో శివశంకర్ పాల్గొన్నారు.

మూడు రోజులే గడువు !

(3వ పేజీ తరువాయి)


తీస్తారు. దరఖాస్తుదారు ఫొటోను యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. ముఖ గుర్తింపును యాప్ క్యాప్చర్ చేసిన వెంటనే ఆధార్ కార్డు ఆటోమేటిక్‌గా డిస్‌ప్లే అవుతుంది. జాబ్ కార్డు వివరాలు, బ్యాంకు ఖాతా వివరాలు తీసుకుంటారు. దరఖాస్తుదారుల్లో మొదట అత్యం త పేదలకే ఇల్లు మంజూరయ్యేలా యాప్‌ను కేంద్ర ప్రభు త్వం డిజైన్ చేసింది. యాప్‌లో నమోదైన వివరాల ఆధా రంగా అర్హుల జాబితా సిద్ధం కానుంది. ఒంటరి మహిళలు, వితంతువులకు ప్రాధాన్యం ఇస్తారు. రాష్ట్ర ప్రభుత్వం యాప్ ద్వారా నమోదు చేసిన వారి వివరాలను కేంద్రానికి నివేదిం చనున్నారు, అక్కడ మరోసారి పరిశీలించి తుది జాబితాకు అనుగుణంగా ఇల్లు మంజూరు అవుతుంది.

టీడీపీ జిల్లా అధ్యక్ష పదవిపై వీడని ఉత్కంఠ

(3వ పేజీ తరువాయి)

కట్టబెట్టాలంటూ జిల్లా వ్యాప్తంగా క్లస్టర్, నియోజకవర్గ ఇన్‌చార్జుల నుంచి పార్టీ అధిష్ఠానం ఫోన్‌కాల్స్ అభిప్రాయ సేకరణ చేపట్టింది. ఇందులో ఎవరి వైపు ఎంత మంది నాయకులు, ఇన్‌చార్జులు మొగ్గుచూపారో అన్న ఉత్కంఠ రేగుతోంది. ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో సంస్థాగతంగా బూత్, గ్రామ,మండల, పట్టణ కమిటీల ప్రమాణ స్వీకారాల ఘట్టం ఘనంగా నిర్వహించారు. ఇదిలా ఉండగా ఐవీఆర్‌ఎస్, ఫోన్‌కాల్స్ అభిప్రాయ సేకరణలో తమను పట్టించుకోకపోవడంతో ఆశావహులైన తెలుగు తమ్ముళ్లలో నిరాశ అలముకుంది. సీఎం చంద్రబాబు నాయుడు డిసెంబరు 1వ తేదీన ఉంగుటూరు పర్యటనకు రానున్నారు. దీంతో ఈ నాలుగు రోజుల్లో ప్రకటన ఉండకపోవచ్చని చెబుతున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475

'పీ-4'కు బాసటగా నిలవాలి

'నూజివీడు' అభివృద్ధికి పారిశ్రామికవేత్తలు, అధికారులు ముందుకు రావాలి : మంత్రి పార్థసారథి


నూజివీడు సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

నూజివీడు/నూజివీడు టౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సీఎం చంద్రబా బునాయుడుకు ఇష్టమైన పీ-4 కార్యక్రమానికి బాసటగా నిలవాలని, రాష్ట్రాన్ని పారిశ్రామికరంగంగా అభివృద్ధి పథంలో నిలిపేందుకు విశేష కృషి చేస్తున్నారని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం నియోజకవర్గ అభివృద్ధికి పబ్లిక్ ప్రైవేటు పీపుల్స్ పార్టనర్‌షిప్ ఫోరంలో పలు శాఖలు అధికారులు, బ్యాంకు అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పీ-4 కార్యక్రమం అమలుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి పిలుపుమేరకు ఇటీవల విశాఖపట్నంలో సీఐఐ సదస్సులో ప్రపంచ వ్యాప్తంగా పారిశ్రామికవేత్తలు స్పందించి రూ.12 లక్షల కోట్లకు పైగా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చారన్నారు. నూజివీడు నియోజకవర్గం అభివృద్ధికి పారిశ్రామికవేత్తలు, ప్రభుత్వ ఉద్యోగులు, బ్యాంకు అధికారులు ముందుకు రావాలని కోరారు. అందరూ ముందుకు వస్తే తొలి సాయంగా తాను రూ.10 లక్షలు అందజేస్తానన్నారు. సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, పారిశ్రా మికవేత్తలు, పలు శాఖలు అధికారులు, బ్యాంకు అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

• నూజివీడు మండలం బత్తులవారిగూడెంలో రూ.32 లక్షలతో గ్రామ సచివాలయ నిర్మాణం, రూ.36 లక్షలతో హెల్త్ సెంటర్, రూ.77 లక్షలతో సీసీ రహదారులు, రేగుంటలో రూ.20 లక్షలతో సీసీ రహదారుల అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి పార్థసారథి శ్రీకారం చుట్టారు. నూజివీడు ఎంపీడీవో కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని 74 మందికి సుమారు రూ.36 లక్షలు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందించారు. జనసేన నూజివీడు నియోజకవర్గ సమన్వయకర్త బర్మా ఫణిబాబు, నూజివీడు తహసీల్దార్ భద్రం, తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పద అంశాలలో నా పేరు ఉపయోగించొద్దు : మంత్రి

వివాదాస్పద అంశాలలో నా పేరును ఎక్కడైనా ఉపయోగించి ఎవరైనా లబ్ధి పొందాలని చూస్తే క్రిమినల్ చర్యలు తీసుకోవాలని మంత్రి ప్రార్థసారథి నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణకు సూచించారు. మీర్జాపురం గ్రామంలో ఓ భూవివాద విషయమై ఆయన పలు శాఖల అధికారులతో వివాదాస్పద భూమి వద్ద సమీక్షించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన చిట్టిబాబు, తదితరులు పూర్వార్జితంగా తమకు భూమి ఉందని పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేయడంతో ఈ విషయమై మంత్రి సారథి స్వయంగా గ్రామంలో సమీక్షించారు. భూవివాద నేపథ్యంలో మంత్రి పాత్ర ఉందంటూ దుష్ప్రచారం చేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై ఇలాంటి ప్రచారాలు చేసేవారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆయన కోరారు.


షష్టి ఉత్సవాల్లో అలరిస్తున్న నూకరాజు, ఫైమా

అలరించిన జబర్దస్త్ టీమ్

కలిదిండి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పెదలంక సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్టి ఉత్సవాల్లో బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమంలో జబర్దస్త్ టీమ్ ప్రేక్షకులను అలరించింది. ఫైమా, నూకరాజు పంచ్ డైలాగ్‌లతో ఉర్రూతలూగించారు. ఈవో శేఖర్ ఉత్సవ కమిటీ సభ్యులు వారిని ఘనంగా సత్కరించారు. నూకరాజు మాట్లాడుతూ తమను ప్రేమాభిమానంతో ఆదరించిన పెదలంక గ్రామ ప్రజలకు, కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీవారి అంతరాలయ దర్శనం పునఃప్రారంభం

ద్వారకాతిరుమల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కరోనా మహమ్మారి ప్రవేశం తర్వాత దాదాపు ఐదేళ్ల అనంతరం ద్వారకాతిరుమల వేంకటేశ్వరాలయంలో అంతరాలయ దర్శనాన్ని అధికారులు గురువారం పునఃప్రారంభించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ప్రతీ భక్తునికి అంతరాలయ దర్శనం నిమిత్తం టిక్కెట్టు రుసుము రూ. 500గా అధికారులు నిర్ణయించి అమలు చేశారు. ఈక్రమంలో ప్రారంభం రోజైన గురువారం 610 మంది అంతరాలయ దర్శనం టిక్కెట్లు తీసుకున్నట్టు ఆలయ ఈవో సత్యనారాయణమూర్తి తెలిపారు.


సగర కార్పొరేషన్ డైరెక్టర్‌గా ప్రమాణస్వీకారం చేస్తున్న గణేష్, డైరెక్టర్లు

సగర కార్పొరేషన్ డైరెక్టర్‌గా గణేష్ ప్రమాణ స్వీకారం

మండవల్లి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర సగర కార్పొరేషన్ డైరెక్టర్‌గా గజ్జల గణేష్ ప్రమాణస్వీకారం చేశారు. గురువారం అమరావతిలో సగర కార్పొరేషన్ ప్రమాణ స్వీకారోత్సవాన్ని నిర్వహించారు. కార్పొరేషన్ చైర్మన్ వెంకటరమణ, డైరెక్టర్లచేత ప్రమాణస్వీకారాన్ని మంత్రి సవిత సమక్షంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వీరిలో మండవల్లి మండలానికి చెందిన గజ్జల గణేష్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ టీడీపీలో అంకితభావంతో పనిచేయడం వల్ల కార్పొరేషన్‌లో పదవి లభించిందన్నారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ సహాయ సహకారాలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆంధ్రాలో ఆక్వా సాగు భేష్


చేపల చెరువును పరిశీలిస్తున్న రైతులు

మండవల్లి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఆంధ్రాలో ఆక్వాసాగు భేష్‌గా ఉందని ఝార్ఖండ్ రైతులు తెలిపారు. మండవల్లి మండలం చింతపాడులో గురువారం రొయ్యలు చేపల సాగును ఝార్ఖండ్‌లోని బొకారో జిల్లాకు చెందిన 16 మంది రైతులు క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. చేపలు, రొయ్యలు ఎంతకాలంలో పెరుగుతాయి? లాభనష్టాలు ఎలా ఉంటాయి ? అనేది రైతుల నుంచి అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రాంతంలో చేపలు, రొయ్యలు చెరువులు బాగా విస్తరించాయని గ్రామాలు అభివృద్ధి చెందాయని వివరించారు.

ఆర్టీఐపై అవగాహన ర్యాలీలు

నూజివీడు టౌన్/కలిదిండి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు తమ హక్కుల కోసం సమాచార హక్కు చట్టాన్ని సక్రమంగా వినియోగించుకోవాలని నూజివీడు సబ్ కలెక్టర్ బి.వినూత్న అన్నారు. గురువారం నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి ఆర్టీఐ చట్టంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డివిజన్‌లోని పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్లు పాల్గొన్నారు. కలిదిండిలో రెవెన్యూ అధికారులు సమాచార హక్కు చట్టంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం కార్యాలయాలు సంస్థల నుంచి సమాచారాన్ని అడిగి తీసుకునే అధికారమే సమాచార హక్కు అన్నారు. డిప్యూటీ తహసీల్దార్ గీత, ఆర్ఐ శ్యామల, వీఆర్వోలు పాల్గొన్నారు.

తుఫాన్ హెచ్చరికతో రైతుల్లో ఆందోళన

ముసునూరు/ముదినేపల్లి,నవంబరు27(ఆంధ్రజ్యోతి):తుఫాన్ హెచ్చరికతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కోతకు వచ్చిన వరి పంటలను యంత్రాలతో కోసి, ధాన్యాన్ని భద్రపరుచుకుంటున్నారు. ముసునూరు మండలంలో 6,300 ఎకరాల్లో వరి పంట సాగయింది. ఇప్పటివరకు 50 శాతం కోతలు పూర్తికాలేదు. వచ్చే నెల మూడో తేదీ వరకు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరిస్తుండడంతో కోతకు వచ్చిన వరి పంటలను యంత్రాలతో కోతలు కోస్తున్నారు. ముదినేపల్లి ప్రాంతంలోని సార్వా వరి రైతుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. వేలాది ఎకరాల్లో సార్వా వరి కోతలు పూర్తి చేసి ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు రోడ్లకు చేర్చిన సమయంలో వాతావరణంలో మార్పులు రావడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ముదినేపల్లి-గుడివాడ జాతీయ రహదారి వెంబడి ధాన్యం పోత పోసి ఆరబెట్టారు. ఈ పరిస్థితుల్లో వర్షం కురిస్తే ధాన్యం నిల్వలు, కోతకు సిద్ధంగా ఉన్న వరి పైరుకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

యువకుడిపై పోక్సో కేసు

కైకలూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): 'మైనర్ యువతికి ఫోన్ చేసి పెళ్లి చేసుకోవాలని లేకుంటే అంతు చూస్తా' అని బెదిరించిన యువకుడిపై పోక్సోకేసు నమోదు చేసినట్లు కైకలూరు రూరల్ ఎస్‌ఐ వి.రాంబాబు తెలిపారు. మండలంలోని ఒక గ్రామానికి చెందిన 17 ఏళ్ళ మైనర్ యువతి ఇంటర్ పూర్తిచేసి ఇంటి వద్దనే ఉంటుంది. చదువుకునే రోజుల్లో కలిదిండి మండలం తాడినాడ శివారు విభారావపురం గ్రామానికి చెందిన పామర్తి భార్గవ్‌తో పరిచయం ఏర్పడింది. ఈ పరిచయాన్ని అడ్డుపెట్టుకుని గతంలో యువతి తల్లిదండ్రులు లేని సమయంలో ఇంటికి వచ్చి లైంగికంగా వేధించి బలవంతం చేసేందుకు ప్రయత్నం చేశాడు. యువతి కేకలు వేయడంతో అక్కడి నుంచి పారిపోయాడు. అల్లరి అయితే పరువు పోతుందని భయంతో తల్లిదండ్రులు ఎవరికి చెప్పలేదు. దీన్ని అలు సుగా తీసుకుని గత నాలుగు రోజులుగా భార్గవ్ ఆ యువతికి ఫోన్ చేసి పెళ్లి చేసుకోవాలని బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో ఆ యువతి కైకలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్సై భార్గవ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

'నూజివీడు'ను ఎన్టీఆర్ జిల్లాలో కలపాలి

▸▸ జేఏసీ ఆధ్వర్యంలో నిరసన దీక్షలు



నూజివీడులో నిరసన దీక్ష చేస్తున్న జేఏసీ నాయకులు

నూజివీడు టౌన్, నవంబరు27 (ఆంధ్రజ్యోతి) : నూజివీడు నియోజక వర్గాన్ని ఎన్టీఆర్ జిల్లాలో కలపాలని నూజివీడు జేఏసీ ఆధ్వర్యంలో నిరసన దీక్షలు చేపట్టారు. గురువారం ఈ దీక్షలను నూజివీడు జేఏసీ గౌరవ అధ్యక్షుడు చలసాని వెంకటరామారావు, కేడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ కొమ్మన నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా చలసాని రామారావు మాట్లాడుతూ నియోజకవర్గాన్ని ఎన్టీఆర్ జిల్లాలో కలపాలని, గతంలో కరోనా కాలంలో ఎన్నో పోరాటాలు చేశామని, గత వైసీపీ ప్రభుత్వంలో జిల్లాల పునర్విభజనలో నూజి వీడును ఏలూరు జిల్లాలో కలపడాన్ని వ్యతిరే కిస్తూ ఏడాదిపాటు పెద్దఎత్తున ప్రజా పోరాటం చేశామన్నారు. దీనిలో భాగంగా ధర్నాలు, నిరా హార దీక్షలు, 72 గ్రామాల్లో జీపు యాత్రతో పాటు లక్ష కరపత్రాల పంపిణీ, 25 వేల సంతకాల సేకరణ, ప్రజా బ్యాలెట్ నిర్వహించి నూజివీడు నుంచి విజయవాడకు పాదయా త్రగా వెళ్లి అప్పటి కలెక్టర్‌కు వినతిపత్రం అందించామన్నారు. నూజివీడు జేఏసీ అధ్యక్షుడు మరిడు శివరామ కృష్ణ, నూజివీడు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఇందుపల్లి సత్యప్రకాష్ మాట్లాడుతూ గతంలో ప్రతిపక్షనేతగా ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 2023లో అంబేడ్కర్ జయంతి సందర్భంగా నూజివీడు వచ్చినప్పుడు, 2024లె ఎన్నికల ప్రచార సభకు వచ్చినప్పుడు బహిరంగ సభలో హామీ ఇచ్చారన్నారు. నూజివీడు ప్రజల ఆకాంక్షలు ఇక్కడ పుట్టి పెరిగిన వారికి తెలుస్తాయని, దీనికి భిన్నంగా ఎవరు వ్యవహరించినా ప్రజల ఆగ్రహానికి గురికావడం తప్పదన్నారు. ఇప్పటికైనా సానుకూలంగా నూజివీడును ఎన్టీఆర్ జిల్లాలో కలిపి పూర్వవైభవం వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పీపుల్స్ ఫోరం నాయకులు విన్నమనేని కుమార్, సబ్బినేని శ్రీని వాస్, సిద్ధార్థ రవి, రాజశేఖర్, ఫరూక్, నూజివీడు జేఏసీ కోశాధికారి చాట్ల పుల్లారావు, జేఏసీ నాయకులు ఎం.సునీల్‌కుమార్, ఎర్రంశెట్టి రాము, నూజివీడు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మన్నవ రమేష్ పాల్గొన్నారు.

కైకలూరు నియోజకవర్గాన్ని కృష్ణా జిల్లాలో కలపాలి : వైష్ణవి



ముదినేపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కైకలూరు అసెంబ్లీ నియోజకవర్గాన్ని కృష్ణా జిల్లాలో కలిపేందుకు ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు చర్యలు తీసుకోవాలని అమ రావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి కోరారు. తాజాగా జిల్లాల పునర్విభజనలో కూట మి ప్రభుత్వం ఈ నియోజకవర్గాన్ని ఏలూరు జిల్లా నుంచి కృష్ణా జిల్లాలో కలుపుతుందని నియోజకవర్గంలోని అన్ని మండలాల ప్రజలు ఎదురుచూశారని, ప్రస్తుతానికి ఆ ప్రతిపాదన పెండింగ్‌లో పెట్టడం వల్ల అన్ని వర్గాల ప్రజలు నిరాశకు గురవుతున్నారని ఆమె గురువారం మీడియాకు తెలిపారు. భౌగోళికంగాను, సామాజిక పరంగాను ఈ నియోజకవర్గ ప్రజలకు మచిలీపట్నం కేంద్రంగా ఉన్న కృష్ణా జిల్లాతో అనుబంధం ఎక్కువన్నారు. ఏలూరు జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే కనీసం ఆర్టీసీ బస్ సౌకర్యం గత నాలుగేళ్లుగా ఏర్పాటు చేయలేదని తెలిపారు.

గ్రావెల్ తవ్వకాలు నిలిపివేయాలని రైతుల నిరసన


నిరసన తెలుపుతున్న రైతులు

ఆగిరిపల్లి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కనసానపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న కర్రగట్టుపై గ్రావెల్ త్వకాలను ఆపాలని ఆ ప్రాంత రైతులు గురువారం నిరసన తెలిపారు. గుంటూరుకు చెందిన సుకవాసి శ్రీనివాసరావు పేరు మీద కర్రగట్టుపై 2.60 ఎకరాల్లోని ఆన్‌లైన్ భూములకు గ్రావెల్ తవ్వకాలకు అనుమతులు లభించాయి. ఈ గ్రావెల్ తవ్వకాల వల్ల దుమ్ము, దూళి పడి పంట పొలాలు దెబ్బ తింటాయని గతంలో తమ ఇబ్బందులను అధికారులకు తెలియజేశామని ఎవరూ పట్టించుకోలేదని తెలిపారు. రోడ్లు పాడైపోతాయని, దుమ్ము వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని నిరసన తెలిపారు. అధికారులు వెంటనే గ్రావెల్ తవ్వకాలను నిలిపివేయాలని కోరారు. రైతులు ఆందోళనతో ప్రస్తుతం మైనింగ్ తవ్వకాలను నిలిపివేశారు.



సింగరాయపాలెం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో భక్తుల క్యూ.. ముదినేపల్లిలో హోమం

సింగరాయపాలెం షష్టిలో పోటెత్తిన భక్తులు

ముదినేపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లో ఉన్న వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న షష్టి కల్యాణ ఉత్సవాల్లో గురువారం భక్తులతో పోటెత్తాయి. పలు ప్రాంతాల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులు పూజలు నిర్వహించారు. దేవస్థానం ఆవరణలోని నాగ ప్రతిమలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్టలో పాలు పోసిన అనంతరం ఆలయంలోని స్వామివార్లను దర్శించుకున్నారు. సుమారు 15 వేల మంది భక్తులు ఉత్సవాల్లో పాల్గొన్నట్లు అధికారుల అంచనా. ఉదయం 5 గంటల నుంచి క్యూ లైన్లు కిటకిటలాడాయి. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ ఆర్.గంగాశ్రీదేవి ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ సభ్యులు బొంగు రవికుమార్, పరసా కృష్ణ, వడ్లమాని నాగ లలిత, భట్టిప్రోలు నాగ శిరీష తదితరులు సిబ్బంది భక్తులకు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కైకలూరు సీఐ రవికుమార్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ వీరభద్రరావు పోలీసు బందోబస్తు నిర్వహించారు.

ముదినేపల్లిలో కల్యాణం..

ముదినేపల్లిలోని వల్లీదేవసేన సమేత పంచముఖ శివనాగ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దివ్య శాంతి కల్యాణ మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ అధ్యక్షుడు నల్లమోతు శివవర ప్రసాద్ దంపతులు స్వామి వార్ల కల్యాణాన్ని జరిపించారు. అనంతరం సహస్రనామ పూజ కార్యక్రమం జరిగింది.

ఫీడ్ ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం

నూజివీడు టౌన్, నవంబరు 27, (ఆంధ్రజ్యోతి):నూజివీడు మండలం మర్రిపూడి గ్రామంలో వేవ్‌ఫుడ్ అండ్ సీడ్ ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం జరిగింది. ఫ్యాక్టరీలో ఫీడ్‌కి సంబంధించిన ప్యాకింగ్‌కి ఉపయోగించే గోనె సంచులకు ప్రమాదవశాత్తు మంటలు అంటుకోవడంతో అగ్నిప్రమాదం జరిగింది. గమనించిన సిబ్బంది అగ్నిమాపకశాఖకు సమాచారం ఇవ్వగా ఘటన స్థలానికి చేరుకున్న నూజివీడు అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనలో ప్రాణ నష్టం లేదని ఆస్తి నష్టం స్వల్పంగా మాత్రమే ఉందని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

స్వదేశీ వస్తువులనే వినియోగించాలి

చాట్రాయి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ ఇచ్చిన ఆత్మనిర్భర భారత్ నినాదానికి స్పందించి ప్రజలందరూ స్వదేశీ వస్తువులనే వినియోగించాలని బీజేపీ జిల్లా ఎస్సీ మోర్చా నాయకుడు బుర్రి శ్రీకర్, మాజీ ఎంపీపీ కందుల కృష్ణ, టీడీపీ నాయకుడు చీదిరాల మారేశ్వరరావు కోరారు. మండలంలోని చనుబండలో గురువారం స్వదేశీ వస్తువులనే వినియోగించాలని కోరుతూ కూటమి నాయకులు ప్రచారం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ స్వదేశీ వస్తువులనే ప్రజలు వినియోగిస్తే భారత్ ఆర్థిక స్వావలంబన సాధిస్తుందన్నారు.

విద్యుత్ స్తంభాలకు చర్యలు

కలిదిండి,నవంబరు27(ఆంధ్రజ్యోతి):పేట కలిదిండి ప్రధాన రహదారిలో నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లను సరి చేస్తామన్నారు. రహదారిపై గడ్డి ట్రాక్టర్లు వెళ్తున్నప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. వాన వస్తే స్తంభాలను తాకవద్దని సూచించారు.

బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా నాగరాజు



ఆగిరిపల్లి, నవంబరు 27, (ఆంధ్రజ్యోతి) : బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా ఆగిరిపల్లి మండలం, ఈదర గ్రామానికి చెందిన దొడ్డా నాగరాజు నియమితులయ్యారు. పార్టీ కేంద్ర నాయకుల ఆదేశాల మేరకు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి ఏపీ బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా దొడ్డా నాగరాజును నియమించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ బీజేపీలో కష్టపడిన వారికి చక్కటి ప్రతిఫలం ఉంటుందని, అందుకు తానే నిదర్శనమన్నారు. కేంద్ర, రాష్ట్ర పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా బెనర్జీ

కైకలూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కైకలూరు మండల యూటీఎఫ్ అధ్యక్షునిగా దండే బెనర్జీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం కైకలూరు ఓరియంటల్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో యూటీఎఫ్ మండల కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో జిల్లా ఆడిట్ కమిటీ చైర్మన్ శ్రీరంగ మోహన్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల ప్రధాన కార్యదర్శిగా పెన్మెత్స సురేష్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మారెళ్ళ రవిశంకర్, కార్యవర్గ సభ్యులు చిట్టిబాబు, హెచ్‌ఎం కట్టా కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.


యువతికి కౌన్సెలింగ్ ఇస్తున్న అధికారులు

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

ముసునూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ముసునూరు మండలం గోపవరంలో బాల్య వివాహాన్ని గురువారం అధికారులు అడ్డుకున్నారు. 15 ఏళ్ల యువతికి, 22 ఏళ్ల యువకుడికి వివాహం జరుగుతుందని హెల్ప్‌లైన్ నంబరుకు వచ్చిన సమాచారం రావడంతో హెల్ప్‌లైన్ జిల్లా కో-ఆర్డినేటర్ రవికుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి బాల్య వివాహాన్ని అడ్డుకున్నారు. యువతికి, ఆమె తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా బాల్యవివాహాలు చేసిన, ప్రోత్సహించిన చట్టరీత్యా నేరమని హెచ్చరిం చారు. మహిళా పోలీస్ సంధ్యారాణి, అంగన్‌వాడీ కార్యకర్త, ఆశావర్కర్ తదితరులు పాల్గొన్నారు.